# హైదరాబాద్ పల్స్
జాతీయ తెలుగు దినపత్రిక

దేశం ముఖ్యం.... దేశ ప్రజల భద్రత ముఖ్యం.... మతం కాదు...

epaper.hyderabadpulsenews.in



విలేకరులు కావలెను

హైదరాబాద్ పల్స్ జాతీయ తెలుగు దినపత్రిక

"ఎంతకైనా తెగిస్తాం... ప్రజల గొంతుకై నిలుస్తాం" అనే నినాదంతో రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రారంభించిన హైదరాబాడ్ పల్స్ జాతీయ దినపత్రికకు తెలుగు రాష్ట్రాలలోని అన్ని మండల, నియోజకవర్గాల, జిల్లాల వ్యాప్తంగా విలేకరులు కావలెను. * సీనియర్లకు ప్రాధాన్యత కలదు.

సంప్రదించవలసిన ఫోన్ నెంబర్స్

- Dr. RAHUL KUMAR 9989834020

- K. Naveen Kumar 94406 53413

www.hyderabadpulse.com HyderabadPulse @hyderabad



సీఈఓ : కె నవీన్ కుమార్ | ఎడిటర్: డా. రాహుల్ కుమార్ | సంపుటి: 03 | సంచిక : 156 | పేజీలు : 08 | ఆదివారం | 14-06-2026 | వెల :4/-

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD, SANGAREDDY, WARANGAL, MANCHIRYAL, VIJAYWADA, GUNTUR, KURNOOL, TIRUPATI, KADAPA, BENGALURU, MUMBAI, CHENNAI, DELHI.


# భారీ వర్షాలు అప్రమత్తంగా ఉండాలి



## సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్ పల్స్,హైదరాబాద్

భారీ వర్షాల నేపథ్యంలో అధికారులకు సీఎం రేవంత్రెడ్డి కీలక ఆదేశాలు జారీ చేశారు. హైదరాబాద్ క్యూర్ పరిధిలో హైఅలర్ట్ ఉండాలన్నారు. పోలీసు, ట్రాఫిక్, మున్సిపల్ శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. హైడ్రా, విద్యుత్, వాటర్ బోర్డు, సంబంధిత శాఖలు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. సీఎస్, డీజీపీ, క్యూర్ స్పెషల్ సీఎస్లతో సమీక్షించి నగరవాసులకు ఇబ్బందులు తలెత్తకుండా సత్వర చర్యలు చేపట్టాలన్నారు. రోడ్లపై నీరు నిలిచే ప్రాంతాల్లో ముందస్తుగా టీమ్స్ మోహరించాలని తెలిపారు.హైదరాబాద్లోని పలు ప్రాంతాల్లో శనివారం భారీ వర్షం కురిసింది. శంషాబాద్ వద్ద బెంగళూరు హైవేపై భారీగా వర్షపు నీరు నిలవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత సిబ్బంది...

2

మిగతా 2 లో...



## బైక్పై ల్యాప్టాప్తో పని..

వీడియో షేర్ చేసి సజ్జనార్ హెచ్చరిక

- బైక్పై వెళుతూ ల్యాప్టాప్లో పనిచేస్తున్న వీడియోను షేర్ చేసిన సజ్జనార్
- 'వర్క్ ఫ్రమ్ బైక్' అంటూ ప్రాణాలతో చెలగాటమాడొద్దని హెచ్చరిక
- ఏకాగ్రత తప్పితే మీకే కాదు, ఇతరులకూ ప్రమాదమని హితవు
- పొట్టకూటి కోసం చేసే పని ప్రాణాలు తీసేలా ఉండకూడదని వ్యాఖ్య

2

## ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం..

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వాంగ్మూలం నమోదు

- తుమ్మల నివాసానికి వెళ్లి వాంగ్మూలాన్ని నమోదు చేసిన సిట్
- తుమ్మల ఫోన్ ట్యాప్ అయినట్లు ప్రాథమిక విచారణలో గుర్తింపు
- తుమ్మల ఫోన్ కాల్స్, లొకేషన్ డేటా వివరాలు సేకరించిన సిట్

2



హైదరాబాద్ పల్స్,హైదరాబాద్

తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసును విచారిస్తున్న ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఈరోజు రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నివాసానికి వెళ్లి ఆయన వాంగ్మూలాన్ని అధికారికంగా నమోదు చేసింది. 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో అక్రమంగా



## కాంగ్రెస్లో కలకలం..

షబ్బీర్ అలీకి ఏఐసీసీ షోకాజ్ నోటీసులు

- మహిళలు, పార్టీ నాయకత్వంపై షబ్బీర్ అలీ అనుచిత వ్యాఖ్యలు చేసినట్టు ఆరోపణలు
- టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ గౌడ్పై అనుచిత వ్యాఖ్యలు చేసినట్టు ప్రచారం
- సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న ఆడియో

2

## మంచిర్యాలలో సింగరేణి కారుణ్య నియామకాలు..


335 మందికి ఆర్డర్లు అందజేసిన డిప్యూటీ సీఎం భట్టి



2

హైదరాబాద్ పల్స్,మంచిర్యాల

మంచిర్యాల జిల్లా కేంద్రంలో సింగరేణి డిపెండెంట్ కార్మికుల నియామక పత్రాల పంపిణీ కార్యక్రమం కోలాహలంగా జరిగింది. సింగరేణి సంస్థలో కారుణ్య నియామకాల కింద



## యూరియా కొరతపై తప్పుడు ప్రచారం చేస్తున్నారు

- కాకాని, నల్లపురెడ్డి అసత్యాలు ప్రచారం చేస్తున్నారన్న ప్రశాంతి రెడ్డి
- నెల్లూరు జిల్లాలో యూరియా కొరత లేదని వెల్లడి
- విత్తనాలు, ఎరువులను ప్రభుత్వం అందుబాటులో ఉంచిందన్న కోవూరు ఎమ్మెల్యే

2

## కోవర్ట్ల సంగతి తేలుస్తాం..

వ్యవహారాన్ని రేవంత్ స్వయంగా పర్యవేక్షిస్తున్నారు: మహేశ్ గౌడ్

మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్ తిరస్కరణ

ఆమెకు సంబంధించిన వివరాలను లీక్ చేసిన తెలంగాణ కాంగ్రెస్ నేత

అంతర్గత విచారణ ప్రారంభమైందన్న మహేశ్ గౌడ్

హైదరాబాద్ పల్స్,హైదరాబాద్

మధ్యప్రదేశ్ రాజ్యసభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్ తిరస్కరణ తెలంగాణ కాంగ్రెస్లో తీవ్ర చర్చకు దారితీసింది. మీనాక్షిపై ఒక కేసు ఉన్నట్టు తెలంగాణ కాంగ్రెస్ నేతే లీక్ ఇచ్చాడని బీజేపీ నేత ఒకరు వెల్లడించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో, ఈ వ్యవహారంపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ అంశాన్ని కాంగ్రెస్ అధిష్ఠానం, రాష్ట్ర నాయకత్వం అత్యంత సీరియస్గా తీసుకున్నట్లు వెల్లడించారు.

2




## ప్రభుత్వంపై కేటీఆర్ ఫైర్..

- కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ ఫైర్.. కార్యకర్తలకు దిశానిర్దేశం
- సిరిసిల్లలో పార్టీ శ్రేణులతో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమావేశం
- కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు
- తనపై కోపంతో స్థానిక నేతలను వేధించొద్దని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి
- ధాన్యం కొనుగోళ్లలో గన్నీ బ్యాగుల కొరతపై విమర్శలు

2



హైదరాబాద్ పల్స్,హైదరాబాద్

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. శనివారం సిరిసిల్లలో నిర్వహించిన పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న ఆయన, పార్టీ శ్రేణులన్నీ ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తనతో ఉన్న వ్యక్తిగత విభేదాల కారణంగా సిరిసిల్లలోని బీఆర్ఎస్ నాయకులను లక్ష్యంగా

## ఆర్మీ చీఫ్గా లెఫ్టినెంట్ జనరల్ ధీరజ్ సేథ్ నియామకం

జూన్ 30న బాధ్యతలు స్వీకరణ

- త్వరలో పదవీ విరమణ చేయనున్న జనరల్ ఉపేంద్ర ద్వివేది
- ఆయన స్థానంలో లెఫ్టినెంట్ జనరల్ ధీరజ్ సేథ్ బాధ్యతలు స్వీకరణ
- 1986లో ఆర్మర్డ్ కార్ప్స్లో అధికారిగా భారత సైన్యంలో చేరిన ధీరజ్

2



హైదరాబాద్ పల్స్,ఢిల్లీ

భారత తదుపరి ఆర్మీ చీఫ్గా లెఫ్టినెంట్ జనరల్ ధీరజ్ సేథ్ నియామకమయ్యారు. ఈ మేరకు కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఆర్మీ చీఫ్గా ఉన్న జనరల్ ఉపేంద్ర ద్వివేది పదవీ విరమణ కానున్న నేపథ్యంలో ధీరజ్ సేథ్ ఆ బాధ్యతలను చేపట్టనున్నారు. ఈనెల 30న లెఫ్టినెంట్ జనరల్ ధీరజ్ సేథ్ ఆర్మీ చీఫ్గా బాధ్యతలు బాధ్యతలు స్వీకరిస్తారు. ప్రస్తుతం వైస్ చీఫ్ ఆఫ్ ది ఆర్మీ స్టాఫ్గా ఉన్న ఆయనకు సైనిక వ్యూహాల్లో అపారమైన అనుభవం ఉంది. ధీరజ్ సేథ్ నేషనల్ డిఫెన్స్ అకాడమీ పూర్వ విద్యార్థి. ఆయన డిసెంబర్ 1986లో భారత సైన్యంలోని ఆర్మర్డ్ సాయుధ దళంలో చేరారు. దాదాపు 40 ఏళ్ల సుదీర్ఘ కాలంలో ఆయన సైన్యంలోని వివిధ విభాగాల్లో, పలు ప్రాంతాల్లో పనిచేశారు. ధీరజ్ సేథ్ తన కెరీర్లో కొన్ని కీలకమైన బాధ్యతలను

## రెండేళ్లలోనే కూటమి ప్రభుత్వం విఫలం

బొత్స సత్యనారాయణ



- నిత్యావసర వస్తువుల ధరలు భారీగా పెరిగాయన్న బొత్స
- రైతులకు గిట్టుబాటు ధరలు లభించడం లేదని విమర్శ
- సూపర్ సిక్స్ పథకాలు ఏమయ్యాయని నిలదీత

2

## హైదరాబాద్లో అక్రమంగా నివసిస్తున్న ఏడుగురు బంగ్లాదేశీయుల అరెస్ట్

- జీడిమెట్ల ప్రాంతంలోని గాజులరామారంలో అద్దె ఇంటిపై దాడులు
- ఎలాంటి పత్రాలు లేకుండా నివసిస్తున్న బంగ్లాదేశీయులు
- జోగిపేటలోని డిపోర్టేషన్ కేంద్రానికి తరలింపు

2



## 24 గంటల్లోనే అమెరికా- ఇరాన్ శాంతి ఒప్పందం!


పాకిస్థాన్ ప్రధాని కీలక ప్రకటన

- పశ్చిమాసియాలో శాంతి దిశగా కీలక అడుగులు
- 24 గంటల్లో అమెరికా- ఇరాన్ ఒప్పందం ఖరారు కానుందని పాకిస్థాన్ పీఎం షెహబాజ్ షరీఫ్ కీలక వ్యాఖ్యలు

2

హైదరాబాద్ పల్స్,డెస్క్

దాదాపు 3 నెలలకుపైగా పశ్చిమాసియాలో తీవ్ర ఉద్రిక్తతలు నెలకొనగా ఎట్టకేలకు దీనికి ఎండ్ కార్డ్ పడేలా కనిపిస్తోంది. అమెరికా- ఇరాన్ మధ్య



# బైక్‌పై ల్యాప్‌టాప్‌తో పని..

మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్ నగరంలో కొందరు యువకులు ప్రదర్శిస్తున్న అత్యుత్సాహంపై నగర పోలీస్ కమిషనర్ సజ్జనార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బైక్ నడుపుతూనే ల్యాప్‌టాప్‌లో ఆఫీస్ పనులు చేస్తూ, ప్రాణాలను పణంగా పెడుతున్న ఓ యువకుడి తీరును ఆయన సోషల్ మీడియా వేదికగా తప్పుబట్టారు. ఇందుకు సంబంధించిన వీడియోను షేర్ చేస్తూ, సదరు యువకుడి నిర్లక్ష్యాన్ని ఎండగట్టారు. ఆ వీడియోలో ఒక వ్యక్తి బైక్ నడుపుతూనే ల్యాప్‌టాప్‌లో పని చేసుకోవడం కనిపిస్తోంది.దీనిపై స్పందించిన సజ్జనార్, "ఏ పనికైనా ఒక పద్ధతి ఉంటుంది. ఇంత ఆత్రుత ఎందుకు? ఆత్రం ఎక్కువైతే ప్రాణాల మీదకు వస్తుంది" అని హెచ్చరించారు. రహదారిపై ప్రయాణిస్తున్నప్పుడు ఏకాగ్రత ఒక్క క్షణం తప్పినా, అది కేవలం సదరు వ్యక్తికే కాకుండా రోడ్డుపై వెళ్లే ఇతర అమాయకుల ప్రాణాలకు కూడా ముప్పుగా మారుతుందని ఆయన గుర్తుచేశారు."కడుపు నింపుకోవడానికి చేసే పని, ప్రాణాలను కడతేర్చేలా ఉండకూడదు" అని ఆయన వ్యాఖ్యానించారు. రోడ్లపై ఇలాంటి బాధ్యతారాహిత్యమైన చర్యలకు స్వస్తి పలికి, ప్రతి ఒక్కరూ సురక్షితంగా ప్రయాణించి గమ్యస్థానాలకు చేరుకోవాలని సజ్జనార్ హితవు పలికారు.

# కాంగ్రెస్‌లో కలకలం..

మొదటి పేజీ తరువాయి

కాంగ్రెస్ పార్టీలో అంతర్గత విభేదాలు మరోసారి బహిర్గతమయ్యాయి. కాంగ్రెస్ సీనియర్ నేత షబ్బీర్ అలీ చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఓ ఆడియో క్లిప్ వైరల్ కావడంతో పార్టీ హైకమాండ్ సీరియస్‌గా స్పందించింది. మహిళలను కించపరిచేలా, అలాగే పార్టీ నాయకత్వంపై అనుచిత వ్యాఖ్యలు చేసినట్లు ఆరోపణలు రావడంతో ఏఐసీసీ క్రమశిక్షణ కమిటీ ఆయనకు షోకాజ్ నోటీసులు జారీ చేసింది.వైరల్ అయిన ఆడియోలో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌తో పాటు మహిళలపై కూడా షబ్బీర్ అలీ అనుచిత వ్యాఖ్యలు చేసినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ ఆడియో సోషల్ మీడియాలో విస్తృతంగా చక్కర్లు కొట్టడంతో కాంగ్రెస్ అధిష్ఠానం ఆగ్రహం వ్యక్తం చేసింది. పార్టీ ప్రతిష్ఠకు భంగం కలిగించేలా వ్యాఖ్యలు చేయడమే కాకుండా, అంతర్గత వ్యవహారాలను బహిరంగ చర్చకు తీసుకురావడంపై కూడా అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో ఆయన నుంచి వివరణ కోరుతూ షోకాజ్ నోటీసులు జారీ చేసింది.

# ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం..

మొదటి పేజీ తరువాయి

ఫోన్ ట్యాపింగ్ జరిగినట్లు ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో సిట్ విస్తృత స్థాయిలో దర్యాప్తు చేపడుతోంది. ప్రాథమిక విచారణలో అప్పట్లో ఖమ్మం రాజకీయాల్లో కీలక పాత్ర పోషించిన తుమ్మల నాగేశ్వరరావు కూడా ట్యాపింగ్‌కు గురైన వారిలో ఒకరని గుర్తించినట్లు సమాచారం. కొందరు ఇంటెలిజెన్స్ అధికారులు ఆయన ఫోన్‌ను అక్రమంగా ట్యాప్ చేయడంతో పాటు, ఆయన కదలికలను ట్రాక్ చేసి వ్యక్తిగత సంభాషణలను పర్యవేక్షించినట్లు దర్యాప్తులో వెలుగులోకి వచ్చినట్లు తెలుస్తోంది.మంత్రి నివాసంలో జరిగిన విచారణ సందర్భంగా ఆయన ఫోన్ కాల్స్, లొకేషన్ డేటా, వ్యక్తిగత కమ్యూనికేషన్లపై జరిగిన నిఘాకు సంబంధించి సిట్ అధికారులు పలు వివరాలు సేకరించారు. బాధితుడిగా తుమ్మల ఇచ్చిన వాంగ్మూలం కేసు దర్యాప్తులో కీలక ఆధారంగా మారే అవకాశముందని అధికారులు భావిస్తున్నారు.ఇప్పటికే ఈ కేసులో గత ప్రభుత్వానికి చెందిన పలువురు సీనియర్ అధికారులు న్యాయపరమైన కస్టడీలో ఉన్నారు. తాజాగా మంత్రి తుమ్మల వాంగ్మూలం నమోదు కావడంతో ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం మరోసారి రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. సిట్ దర్యాప్తు వేగవంతం కావడంతో రానున్న రోజుల్లో మరికొంతమంది రాజకీయ నాయకులు, అధికారులకు నోటీసులు జారీ అయ్యే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది.

# మంచిర్యాలలో సింగరేణి కారుణ్య నియామకాలు..

మొదటి పేజీ తరువాయి

ఎంపికైన 335 మంది డిపెండెంట్ కార్మికులకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథులుగా హాజరై నియామక పత్రాలను అందజేశారు.ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. సింగరేణి సంస్థ తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు గుండెకాయ లాంటిదని, కార్మికుల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. కారుణ్య నియామకాల ప్రక్రియను వేగవంతం చేసి, బాధిత కుటుంబాల్లో వెలుగులు నింపడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని చెప్పారు. ఉద్యోగాలు సాధించిన యువత క్రమశిక్షణతో పనిచేసి సింగరేణి పురోభివృద్ధికి తోడ్పడాలని పిలుపునిచ్చారు.మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. సింగరేణిని మరింత లాభాల బాటలో నడిపించేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడుకుంటూనే, స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెంచుతామని హామీ ఇచ్చారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ కార్మిక కుటుంబాల హక్కులను కాపాడటంలో ప్రభుత్వం ఎల్లప్పుడూ ముందుంటుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న (చింతపండు విఠల్), స్థానిక ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, ఎమ్మెల్యేలు మకాన్ సింగ్ రాజ్ ఠాకూర్, గడ్డం వినోద్, గండ్ర సత్యనారాయణతో పాటు సింగరేణి ఉన్నతాధికారులు, కార్మిక సంఘాల నాయకులు, కార్మిక కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# ప్రభుత్వంపై కేటీఆర్ ఫైర్..

మొదటి పేజీ తరువాయి

చేసుకోవద్దని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. బతుకమ్మ చీరల ఆర్డర్లను రద్దు చేయడం ద్వారా స్థానిక చిన్న తరహా పరిశ్రమలను ప్రభుత్వం దెబ్బతీసిందని ఆరోపించారు. రాష్ట్రంలో రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు కనీసం గన్నీ బ్యాగులు కూడా అందుబాటులో లేవని, ఉన్నవాటిని ఇతర అవసరాలకు మళ్లించారని విమర్శించారు.కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 900 రోజులైనా ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని కేటీఆర్ విమర్శించారు. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న వారిపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని మండిపడ్డారు. రానున్న ఎన్నికల్లో 119 నియోజకవర్గాల్లోనూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను పార్టీ ముఖచిత్రంగా ప్రాజెక్ట్ చేయాలని, ఆయన్ను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

# కోవర్ట్‌ల సంగతి తేలుస్తాం..

మొదటి పేజీ తరువాయి

నామినేషన్ తిరస్కరణకు దారితీసిన పరిస్థితులు ఏమిటి, ఎక్కడ పొరపాటు జరిగింది, దీనికి బాధ్యులు ఎవరు అనే విషయాలపై ఇప్పటికే అంతర్గత విచారణ ప్రారంభమైనట్లు తెలిపారు. ఈ వ్యవహారాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా పర్యవేక్షిస్తున్నారని, ఎక్కడ లోపం జరిగిందో, ఎవరి పాత్ర ఉందో సమగ్రంగా సమీక్షిస్తున్నారని చెప్పారు. కాంగ్రెస్‌లో ఉండి ప్రత్యర్థి పార్టీలకు లాభం చేకూర్చే కోవర్ట్‌లను త్వరలోనే గుర్తిస్తామని మహేశ్ గౌడ్ హెచ్చరించారు. "లీక్ వీరులు ఎవరో, గ్రీక్ వీరులు ఎవరో త్వరలో అందరికీ తెలుస్తుంది" అని అన్నారు.నామినేషన్ వ్యవహారంలో బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని పార్టీ నాయకత్వం సంకేతాలు ఇచ్చింది. అంతర్గత విచారణ వేగం పుంజుకోవడంతో లీకుల వెనుక ఉన్న అసలు వ్యక్తులు త్వరలోనే బయటపడే అవకాశముందని కాంగ్రెస్ వర్గాలు భావిస్తున్నాయి.

# యూరియా కొరతపై తప్పుడు ప్రచారం చేస్తున్నారు

మొదటి పేజీ తరువాయి

నెల్లూరు జిల్లాలో వర్షాకాలం ప్రారంభమై రైతులు సాగు పనులకు సిద్ధమవుతున్న వేళ యూరియా కొరత, ప్రభుత్వ నిర్లక్ష్యం అంటూ జరుగుతున్న ప్రచారంపై టీడీపీ ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి తీవ్రంగా స్పందించారు. యూరియా కొరత ఉందంటూ కొందరు ఉద్దేశపూర్వకంగా తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆమె ఆరోపించారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యేలు కాకాణి గోవర్ధన్ రెడ్డి, నల్లపురెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డిలపై ప్రశాంతి రెడ్డి విమర్శలు గుప్పించారు. రైతులను తప్పుదారి పట్టించేలా యూరియా లభ్యతపై అసత్య ప్రచారం చేస్తున్నారని ఆమె మండిపడ్డారు. జిల్లాలో ఎలాంటి యూరియా కొరత లేదని, రైతుల అవసరాలకు సరిపడా నిల్వలు అందుబాటులో ఉన్నాయని స్పష్టం చేశారు.కొంతమంది రాజకీయ ప్రయోజనాల కోసం రైతుల్లో గందరగోళం సృష్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆమె ఆరోపించారు. రైతులు వదంతులను నమ్మకుండా అధికారుల సూచనలు పాటించాలని కోరారు. ప్రభుత్వం వ్యవసాయ రంగానికి అవసరమైన ఎరువులు, విత్తనాలు సమృద్ధిగా అందుబాటులో ఉంచిందని తెలిపారు.అలాగే కోవూరులో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న కాకాణి గోవర్ధన్ రెడ్డి, ప్రసన్న కుమార్ రెడ్డిలను ఉద్దేశించి కూడా ఆమె విమర్శలు చేశారు. వారు అక్కడికి పేరంటానికి వెళ్లినట్టు వెళ్లారని వ్యాఖ్యానించారు. రైతుల సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాల్సిన నాయకులు రాజకీయ విమర్శలకు పరిమితమవుతున్నారని ప్రశాంతి రెడ్డి అన్నారు. యూరియా కొరతపై జరుగుతున్న ప్రచారం పూర్తిగా నిరాధారమని, రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

# రెండేళ్లలోనే కూటమి ప్రభుత్వం విఫలం

మొదటి పేజీ తరువాయి

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తికాకముందే అన్ని రంగాల్లో విఫలమైందని వైసీపీ శాసనమండలి పక్ష నేత బొత్స సత్యనారాయణ విమర్శించారు. ఈరోజు విశాఖపట్నంలో మీడియాతో మాట్లాడిన ఆయన, ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు.నిత్యావసర వస్తువుల ధరలు భారీగా పెరగడంతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బొత్స పేర్కొన్నారు. రైతులకు తమ పంటలకు గిట్టుబాటు ధరలు లభించడం లేదని, జొన్న, మామిడి పంటలకు కూడా కనీస మద్దతు ధర అందడం లేదని అన్నారు. ఆక్వా రంగం పూర్తిగా సంక్షోభంలో కూరుకుపోయిందని ఆరోపించారు.విద్యాశాఖను మంత్రి నారా లోకేశ్‌కు అభివృద్ధి కోసం అప్పగించారా లేక దాన్ని నిర్వీర్యం చేయడానికా అని ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో ప్రకటించిన సూపర్ సిక్స్, సూపర్ సెవన్ హామీలు ఏమయ్యాయని నిలదీశారు. ఆడబిడ్డ నిధి పథకాన్ని ప్రభుత్వం దాదాపు పక్కన పెట్టిందని విమర్శించారు.ఇటీవల తిరుపతిలో నిర్వహించిన సభను విజయోత్సవ సభగా కాకుండా 'వెన్నుపోటు ఉత్సవం'గా అభివర్ణించిన బొత్స, టీడీపీని 'వెన్నుపోటు పార్టీ'గా పేర్కొన్నారు. రైతులు యూరియా కోసం ఒడిశా నుంచి ఒక్కో బస్తా రూ.600 చొప్పున కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొందని ఆరోపించారు.ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చని ఈ ప్రభుత్వానికి ఒక్క నిమిషం కూడా అధికారంలో కొనసాగే హక్కు లేదని బొత్స వ్యాఖ్యానించారు. 'రెండేళ్ల వెన్నుపోటు' ఉద్యమాన్ని మరింత ఉద్ధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు.

## ఆర్మీ చీఫ్‌గా లెఫ్టినెంట్ జనరల్

# ధీరజ్ సేథ్ నియామకం

మొదటి పేజీ తరువాయి

నిర్వహించారు. ఎడారి సరిహద్దుల్లోని ఒక కీలకమైన ఆర్మర్డ్ రెజిమెంట్‌కు నాయకత్వం వహించారు. పశ్చిమ ఆర్మర్డ్ బ్రిగేడ్ కమాండర్‌గా బాధ్యతలను నిర్వహించారు. జమ్ముకశ్మీర్ ప్రాంతంలో ఉగ్రవాద నిరోధక దళం కమాండర్‌గా పనిచేశారు. ఉగ్రవాదులను నిర్మూలించడంతో పాటు శాంతిభద్రతల పరిరక్షణలో కీలకంగా వ్యవహరించారు.లెఫ్టినెంట్ జనరల్ హోదా పదోన్నతి పొందిన తరువాత భారత సైన్యానికి చెందిన అత్యంత శక్తివంతమైన ప్రధాన స్ట్రైక్ ఫార్మేషన్లలో ఒకటైన 'సుదర్శన్ చక్ర కోర్'కు కమాండర్‌గా వ్యవహరించడం ధీరజ్ సేథ్ కెరీర్?లో కీలకమైన ఘట్టంగా చెప్పుకోవాలి. యుద్ధ వేళల్లో శత్రువులపై మెరుపుదాడి చేసే వ్యూహాలను రూపొందించడంలో 'సుదర్శన్ చక్ర కోర్ అత్యంత కీలకమైనది. ధీరజ్ సేథ్ కెరీర్‌లో అరుదైన గుర్తింపులను సొంతం చేసుకున్నారు. ఆర్మీ కమాండర్‌గా పదోన్నతి పొందిన తర్వాత భారత సైన్యంలోని రెండు అత్యంత కీలకమైన సౌత్ వెస్ట్రన్ కమాండ్, సదరన్ కమాండ్‌గా పని చేశారు. భారత ఆర్మీలో ఇలాంటి అవకాశం చాలా తక్కువ మంది అధికారులకు లభించింది.

**ఆపరేషన్ సింధూర్‌లోనూ**

పలు ఆపరేషన్?లకు సంబంధించిన ప్రణాళికలు, దళాల నిర్వహణ, సైనిక సామర్థ్యాల అభివృద్ధిలో ధీరజ్? విశేషమైన కృషిచేశారు. గతేడాది పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో భారత సైన్యం అత్యంత వ్యూహాత్మకంగా చేపట్టిన ఆపరేషన్ సింధూర్ సమయంలో పుణె కేంద్రంగా ఉన్న సదరన్ కమాండ్‌కు ధీరజ్ నాయకత్వం వహించారు. అనంతరం పశ్చిమ సరిహద్దు వెంబడి నిర్వహించిన త్రివిధ దళాల సంయుక్త విన్యాసాలను సమన్వయం చేశారు. ముఖ్యంగా రాజస్థాన్ ఎడారి ప్రాంతంలో జరిగిన అతిపెద్ద త్రివిధ దళాల సంయుక్త విన్యాసం "ఎక్సర్‌సైజ్ త్రిశూల్"కు ఆయన పర్యవేక్షించారు. అంగోలాలోని ఐక్యరాజ్యసమితి శాంతి భద్రతా మిషన్‌లోనూ ఆయన సేవలందించారు. అలాగే, అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలను, భవిష్యత్ యుద్ధరంగంతో సమన్వయం చేయడంలో ఆయన చేసిన సేవలు కీలకమైనవి.

**ఇక ఉపేంద్ర ద్వివేది విషయానికొస్తే,**

భారత సైన్యాధిపతిగా విశేషమైన సేవలు అందించిన జనరల్ ఉపేంద్ర ద్వివేది, 2024 జూన్‌లో 30వ భారత ఆర్మీ చీఫ్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈ ఏడాది జూన్ 30న పదవీ విరమణ చేయనున్నారు. దాదాపు 4 దశాబ్దాల పాటు సాగిన ఆయన మిలిటరీ కెరీర్‌లో ఎన్నో కీలక బాధ్యతలు చేపట్టారు. ఎన్నో కీలక ఆపరేషన్?లలో పాల్గొన్నారు. శత్రుమూకల ఆట కట్టించేందుకు, భవిష్యత్తులో వచ్చే ముప్పులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ఆయన విశేషమైన కృషి చేశారు. చైనా, పాకిస్థాన్? సరిహద్దుల్లో రక్షణ వ్యూహాలను పర్యవేక్షించారు. కొన్ని సందర్భాల్లో పాకిస్థాన్?కు గట్టి హెచ్చరికలు చేశారు. సరిహద్దుల్లో ఉగ్రవాదానికి మద్దతు ఇస్తే తీవ్ర పరిణామాలుంటాయని, పాకిస్థాన్ ప్రపంచపటంలో ఉండాలనుకుంటే సీమాంతర ఉగ్రవాదాన్ని ఆపివేయాలని ఇటీవల ఆయన వార్నింగ్ ఇచ్చారు. ఇక, అమెరికాలోని ప్రతిష్టాత్మకమైన 'యూఎస్ ఆర్మీ వార్ కాలేజ్- ఇంటర్నేషనల్ హాల్ ఆఫ్ ఫేమ్'లో ఆయనకు చోటు దక్కింది. అంతేకాదు, ఈ అరుదైన గౌరవాన్ని దక్కించుకున్న మూడో భారత సైనికాధికారిగా ఆయన నిలిచారు.

# 24 గంటల్లోనే అమెరికా- ఇరాన్ శాంతి ఒప్పందం!

మొదటి పేజీ తరువాయి

శాంతి ఒప్పందం మరో 24 గంటల్లో ఖరారయ్యే అవకాశం ఉందని పాకిస్థాన్ ప్రధాన మంత్రి షెహబాజ్ షరీఫ్ తాజాగా ప్రకటన చేయడం చర్చనీయాంశంగా మారింది. అమెరికా ఇరాన్ మధ్య చర్చలు దాదాపు తుది దశకు చేరుకున్నాయని, ఒప్పందం ఖరారైన వెంటనే డీల్‌పై ఎలక్ట్రానిక్ విధానంలో సంతకాలు జరిగేలా పాకిస్థాన్ ఏర్పాట్లు చేస్తున్నట్లు షరీఫ్ తెలిపారు. దీనికి సంబంధించి ఆయన సోషల్ మీడియా ప్లాట్‌ఫాం ఎక్స్‌లో శనివారం ఓ పోస్ట్ చేశారు."శాంతి ఒప్పందానికి మేం ఎప్పుడూ ఇంత దగ్గరగా రాలేదు. మరో 24 గంటల్లోనే ఒప్పందం ఖరారయ్యే అవకాశం ఉంది. తర్వాత ఎలక్ట్రానిక్ సంతకాలు, వచ్చే వారమే సాంకేతిక స్థాయి చర్చలు జరుగుతాయి" అని పాకిస్థాన్ పీఎం పేర్కొన్నారు. ఈ క్రమంలోనే చర్చల సమయంలో ఎంతో సహకరించిన అమెరికా- ఇరాన్ ప్రభుత్వాలకు షరీఫ్ కృతజ్ఞతలు తెలిపారు. మద్దతు ఇచ్చిన పశ్చిమాసియాలోని ఇతర దేశాలకు కూడా ధన్యవాదాలు చెప్పారు. దీర్ఘకాలిక శాంతి దిశగా ఈ చారిత్రక ఒప్పందం బలమైన పునాది వేస్తుందని విశ్వసిస్తున్నట్లు వెల్లడించారు.షరీఫ్ ప్రకటనకు ఒకరోజు ముందుగా ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీకూడా ఈ ఒప్పందం గురించి కీలక వ్యాఖ్యలు చేశారు. 'ఇస్లామాబాద్ అవగాహనా ఒప్పందం ఇంతకుముందెన్నడూ లేనంత దగ్గరలో ఉంది. తుది ఒప్పందం పూర్తయ్యే వరకు మీడియా ఊహాగానాలన్నింటికీ దూరంగా ఉండాలి' అని చెప్పారు. అరాగ్చీ పోస్ట్‌ను యూఎస్ ప్రెసిడెంట్ డొనాల్డ్ ట్రంప్ కూడా తన సోషల్ మీడియా ఖాతాలో పోస్ట్ చేయడం విశేష

# భారీ వర్షాలు... అప్రమత్తంగా ఉండాలి

మొదటి పేజీ తరువాయి



మోటార్ల ద్వారా నీటిని తొలగిస్తున్నారు. షాద్నగర్లోనూ జాతీయ రహదారిపై భారీగా వరద నిలిచింది.

**పోలీసులు హైఅలర్ట్లో ఉండాలి: డీజీపీ**

హైదరాబాద్లోని వర్ష ప్రభావిత ప్రాంతాల్లో డీజీపీ సీవీ ఆనంద్ పర్యటించారు. మల్కంపేట చెరువు, టోలిచౌకీల్లో పరిస్థితిని పరిశీలించారు. సైబరాబాద్ సీపీ రమేష్తో కలిసి నీటమునిగిన ప్రాంతాలు, ట్రాఫిక్ పరిస్థితులను సమీక్షించారు. కీలక జంక్షన్లలో అదనపు పోలీసు సిబ్బందిని మోహరించాలన్నారు. హైదరాబాద్ తో పాటు వర్ష ప్రభావిత జిల్లాల పోలీసు అధికారులు హైఅలర్ట్లో ఉండాలని ఆదేశించారు.

# హైదరాబాద్‌లో అక్రమంగా నివసిస్తున్న ఏడుగురు బంగ్లాదేశీయుల అరెస్ట్

మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్‌లో అక్రమ వలసదారులపై పోలీసులు చేపట్టిన ప్రత్యేక తనిఖీల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. జీడిమెట్ల ప్రాంతంలో అక్రమంగా నివసిస్తున్న ఏడుగురు బంగ్లాదేశ్ పౌరులను పోలీసులు అరెస్ట్ చేశారు. విశ్వసనీయ సమాచారం ఆధారంగా పోలీసులు గాజులరామారం హెచ్ఏఎల్ కాలనీలోని ఓ అద్దె ఇంటిపై దాడులు నిర్వహించారు. ఈ తనిఖీల్లో అక్కడ నివసిస్తున్న ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. చెల్లుబాటు అయ్యే పాస్‌పోర్టులు, వీసాలు లేదా ఇతర అవసరమైన పత్రాలు లేకుండా వీరు ఉంటున్నట్లు గుర్తించారు. తదుపరి న్యాయపరమైన చర్యల కోసం వారిని మెదక్ జిల్లా జోగిపేటలో ఉన్న డిపోర్టేషన్ కేంద్రానికి తరలించినట్లు అధికారులు తెలిపారు. వారి భారత్ ప్రవేశం, నివాసం, ఇతర వివరాలపై లోతైన దర్యాప్తు కొనసాగుతోంది. బెంగాల్ లోని సువేందు అధికారి ప్రభుత్వం అమలు చేస్తున్న 'గుర్తింపు--తొలగింపు--దేశ బహిష్కరణ' విధానంలో భాగంగా అక్రమ వలసదారులపై చర్యలు మరింత కఠినతరం అవుతున్నాయి. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లో కూడా అదే తరహా తనిఖీలు జరగడం గమనార్హం.

# ప్రకృతి పరిరక్షణే లక్ష్యంగా మొక్కలు నాటాలి

### పీహెచ్డీ స్కాలర్ చల్ల రామకృష్ణ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాట్లు

**జేఎన్‌టీయూ, కూకట్పల్లి, జూన్ 13, హైదరాబాద్ పల్స్ ప్రతినిధి :**
ప్రధాన మంత్రి సూచనల మేరకు ప్రకృతి పరిరక్షణ, పచ్చదనం పెంపొందించడం, పర్యావరణ సమతుల్యతను కాపాడడం లక్ష్యంగా పీహెచ్డీ స్కాలర్ చల్ల రామకృష్ణ రెడ్డి ఆధ్వర్యంలో జేఎన్‌టీయూ (హెచ్) క్యాంపస్‌లో మొక్కలు నాటే కార్యక్రమం ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి జేఎన్‌టీయూ (హెచ్) ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డా. ఎల్. సైదా నాయక్ ముఖ్య అతిథిగా హాజరై మొక్కలు నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, మొక్కలు నాటడం ద్వారా భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌డీ స్కాలర్స్ చల్లా రామకృష్ణ రెడ్డి, పితాని సందీప్ గౌడ్, బీటెక్ విద్యార్థులు జయరామ్, సాయిరామ్, స్పందన, సరయు, సంపత్, మనీష్, విశ్వజిత్, యశోవర్ధన్ తదితరులు పాల్గొని మొక్కలు నాటారు. అదేవిధంగా బీజేపీ రాష్ట్ర నాయకులు కుమార్ యాదవ్, భరత్ వీర్ ప్రత్యేక అతిథులుగా పాల్గొని పర్యావరణ పరిరక్షణలో యువత ముందుండాలని పిలుపునిచ్చారు. ప్రకృతి బాగుండాలి – గ్రీనరీ పెరగాలి అనే సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నిర్వాహకులు



రామకృష్ణ రెడ్డి తెలిపారు.

# మరమత్తులకు నోచుకోని చెరువులు-కూరుకుపోయిన కాలువలు

**రైతులకు ఎదురవుతున్న సాగు కష్టాలు-పట్టించుకోని ప్రభుత్వం**

**రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ వై.నరోత్తం**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, జహీరాబాద్, జూన్ 13 :**
రైతులకు ఎంతో మేలు చేసే చెరువుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చూపుతోందని, రైతులకు సాగునీరు అందడం లేదని రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు వై.నరోత్తం తెలిపారు. శనివారం జహీరాబాద్ లో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్ లో ఆయన మాట్లాడారు. చెరువులకు మరమ్మతులు చేయకపోవడం, కాలువలు పూడుకపోయి ఎలాంటి ఉపయోగంలో లేకపోవడం వల్ల రైతుల పంటలకు నీరందడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. జహీరాబాద్ లో ఇరిగేషన్ శాఖ ఎగ్జిక్యూటివ్ డివిజన్ కార్యాలయం ఉందని అందులో పని చేసే 50 మంది సిబ్బందికి ఎలాంటి పని లేకుండా పోయిందన్నారు. సంవత్సరానికి సిబ్బందికి నాలుగు కోట్ల రూపాయల వరకు వేతనాలు చెల్లిస్తున్నప్పటికీ వారి ద్వారా రైతులకు నయా పైసా లబ్ధి చేకూరడం లేదన్నారు. జహీరాబాద్ నియోజకవర్గం లో 76 చెరువులు ఉన్నాయని వాటి ద్వారా 12262 ఎకరాలకు నీరందించే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వం, అధికారుల నిర్లక్ష్యం వల్ల కేవలం 3000 ఎకరాలకు మాత్రమే సాగునీరు అందుతుందన్నారు. చెరువులకు మరమ్మతులు లేకపోవడం, కాలువలు పూడుకొని పోవడం, చెరువు కట్టలకు మరమ్మతు చేయకపోవడంతో చెరువులో నిండిన నీటిని పూర్తిస్థాయిలో రైతులకు అందడం లేదన్నారు. ఇరిగేషన్ శాఖ అధికారులు రైతులకు సాగునీరు అందించే ఏర్పాట్లు చేయకుండా కేవలం రియల్ ఎస్టేట్ వ్యాపారులకు ఎన్ఓసీలు ఇవ్వడానికే మొగ్గు చూపుతున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం చెరువుల మరమ్మత్తుచేసి, కాలువలలో పేరుకుపోయిన పూడికను తొలగించి పూర్తిస్థాయిలో రైతులకు నీరు అందించాలని ఆయన డిమాండ్ చేశారు. తెలంగాణలోని సాగునీటి ప్రాజెక్టులపై రాష్ట్ర ప్రభుత్వం ఏమాత్రం శ్రద్ధ చూపడం లేదన్నారు. బనకచర్ల, కావేరి ప్రాజెక్టుల నుండి గోదావరి నీటిని కావేరి లో కలపడం వల్ల తెలంగాణకు ఎంతో నష్టం జరుగుతుందన్నారు. ఈ ప్రెస్ మీట్ లో బిఆర్ఎస్ నాయకులు షికారి గోపాల్, చెంగల్ జైపాల్,



శివకుమార్, వెంకట్, మేఘనాథ్ తదితరులు పాల్గొన్నారు.

# తల్లిదండ్రుల ఆశయాలకు అక్షర రూపం..

## సేవా కార్యక్రమాలతో జన్మదిన వేడుకలు జరుపుకున్న ఉప సర్పంచ్ రాజు

**63 మంది మానసిక వికలాంగులకు అన్నదానం..**

**అనాథల మధ్య పుట్టినరోజు వేడుకలు**

**హైదరాబాద్ పల్స్, జూన్ 13, మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి :**
డోర్నకల్ మండలం చిలుకోడు గ్రామ ఉప సర్పంచ్ రామనబోయిన రాజు తన జన్మదినాన్ని సమాజానికి ఆదర్శంగా నిలిచే విధంగా నిర్వహించి అందరి ప్రశంసలు అందుకుంటున్నారు. శనివారం ఖమ్మం నగరంలోని శాంతి నికేతన్ అనాథాశ్రమంలో నివసిస్తున్న 63 మంది మానసిక వికలాంగులకు ప్రత్యేక భోజనాలు ఏర్పాటు చేసి, వారి మధ్యే పుట్టినరోజు వేడుకలను కుటుంబ సభ్యులతో కలిసి సాదాసీదాగా, కానీ ఎంతో అర్థవంతంగా నిర్వహించారు. ప్రస్తుతం సమాజంలో జన్మదిన వేడుకలు ఆర్భాటాలకు, విలాసాలకు పరిమితమవుతున్న తరుణంలో రామనబోయిన రాజు మాత్రం సేవా మార్గాన్ని ఎంచుకుని తన ప్రత్యేకతను చాటుకున్నారు. తల్లిదండ్రుల జ్ఞాపకార్థం ప్రతి సంవత్సరం పేదలు, అనాథలు, నిరుపేదలు, మానసిక వికలాంగులకు అండగా నిలిచే కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. వారితో కలిసి కేక్ కట్ చేయడం, భోజనం చేయడం, ఆప్యాయంగా మాట్లాడటం అక్కడి వారిని భావోద్వేగానికి గురిచేసింది. ఆశ్రమ నిర్వాహకులు మాట్లాడుతూ సమాజంలో ఇలాంటి సేవా కార్యక్రమాలు మరింత పెరగాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజాప్రతినిధులు సేవా కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇవ్వడం అభినందనీయమని పేర్కొన్నారు. గ్రామ ప్రజలు, సామాజిక కార్యకర్తలు, యువకులు రామనబోయిన రాజు చేపట్టిన ఈ కార్యక్రమాన్ని అభినందిస్తూ, తల్లిదండ్రుల జ్ఞాపకాలను సేవా కార్యక్రమాల రూపంలో సజీవంగా ఉంచడం గొప్ప విషయమని కొనియాడారు.



# ఎ.ఐ గర్ల్‌ఫ్రెండ్.. టీన్ బాయ్స్‌ను ఎందుకు ఆకర్షిస్తోంది?

**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 13 :**
మీ టీనేజర్స్ అత్యధిక సమయం స్మార్ట్‌ఫోన్‌లోనే లీనమైపోతున్నారా? బయటి ప్రపంచంపట్ల అనాసక్తిగా ఉంటున్నారా? అయితే వారు ఏఐ చాట్‌బాట్లతో సంభాషిస్న్?న్నారేమో గమనించండి అంటున్నారు నిపుణులు. ఎందుకంటే.. ఇటీవల యువతలో ఈ కొత్త ధోరణి విస్తరిస్తోంది. క్యారెక్టర్.ఏఐ, రెప్లికా వంటి ప్లాట్‌ఫామ్‌లు అనేకమందది టీనేజ్ బాయ్స్‌ను ఆకర్షిస్తున్నాయని, వీరు ఏఐ సహచరులతో పారాసోషల్ (వన్‌సైడ్) రొమాంటిక్ సంబంధాలు ఏర్పరచుకుంటున్నారని అధ్యయనాలు చెబుతున్నాయి.


**ఏఐ.. ఎమోషనల్:**
ప్రధానంగా 13 నుంచి17 ఏళ్లలోపు టీనేజ్ అబ్బాయిలు క్యారెక్టర్ ఏఐకి ఎక్కువగా అట్రాక్ట్ అవుతున్నట్లు నిపుణులు చెబుతున్నారు. ప్యూ రీసెర్చ్ ప్రకారం కూడా.. వరల్డ్‌వైడ్‌గా టీనేజ్ బాయ్స్‌లో 64% మంది ఏఐ చాట్‌బాట్‌లు ఉపయోగిస్తున్నారు. ఇవి ఎప్పుడూ, ఏ విషయాన్నైనా యాక్సెప్ట్ చేస్తుండటం, రిజెక్ట్ చేసే పరిస్థితులు లేకపోవడం, ఎమోషనల్ సపోర్ట్ అందించడం, 24/7 అందుబాటులో ఉండే "పర్ఫెక్ట్" సహచరులుగా లేదా "పర్ఫెక్ట్" గర్ల్ ఫ్రెండ్‌గా అనిపించడం వల్ల ఆకర్షణ పెరుగుతోంది.

**పెరుగుతున్న మోజు..:**
సామాజిక ఆందోళన, ఒంటరితనం, రిజెక్షన్ భయం ఉన్న టీనేజర్స్ ఏఐ చాట్‌బాట్‌లతో ఇంటరాక్ట్ అయినప్పుడు ఎమోషనల్ సపోర్ట్‌గా వ్యవహరిస్తున్నాయి. సురక్షితమైన, మృదువైన, ప్రేమతో కూడిన ఇంటరాక్షన్ అందిస్తున్నాయి. అందుకే టీనేజ్ అబ్బాయిల్లో క్యారెక్టర్ ఏఐ పట్ల మోజు పెరుగుతోందని నిపుణులు అంటున్నారు. ఇక (18-34)లో కూడా 28% పురుషులు ఏఐ గర్ల్‌ఫ్రెండ్ యాప్‌లను ప్రయత్నించినట్లు గణాంకాలు చెబుతున్నాయి. మొత్తానికి ఏఐ యువతను సరికొత్త ప్రపంచంలోకి ఆకర్షిస్తోంది.

**లాభమా? నష్టమా?**

**లాభాలు :** కొన్ని అధ్యయనాలు (సంబంధిత) యువత ఏఐ సహచరులతో ఇంటరాక్ట్ అవ్వడంవల్ల ఒంటరితనం, ఆందోళన వంటివి తగ్గడం, భావోద్వేగ మద్దతు వంటి సానుకూల ప్రభావాలు ఉంటాయని పేర్కొంటున్నాయి. అంతేకాకుండా యూజర్లు నిజమైన సంబంధాల్లో మెరుగైన కమ్యూనికేషన్ నేర్చుకున్నట్లు వెల్లడించాయి.

**నష్టాలు:** క్యారెక్టర్ ఏఐ పట్ల పెరుగుతున్న ఆకర్షణ ఒంటరితనాన్ని కొంత వరకు తగ్గించినప్పటికీ




దీర్ఘకాలిక నష్టాలను కలిగిస్తుందని మరికొన్ని అధ్యయనాలు హెచ్చరిస్తున్నాయి. ముఖ్యంగా సామాజిక నైపుణ్యాలు తగ్గుతాయని, హై డిపెండెన్సీ పెరుగుతుందని, నిజమైన సంబంధాలపట్ల అవగాహన, ఆకర్షణ తగ్గుతుందని, సోషల్ విత్‌డ్రాయల్ పెరగుతుందని చెబుతున్నాయి. అంతేకాకుండా టీనేజ్ అబ్బాయిల మానసిక అభివృద్ధికి ఇది ప్రమాదకరమని కూడా నిపుణులు అంటున్నారు. మొత్తంగా నష్టాలు ఎక్కువగా ఉన్నట్లు పరిశోధకులు, థెరపిస్టులు భావిస్తున్నారు. క్యారెక్టర్ ఏఐ వాడకంపట్ల జాగ్రత్తలు అవసరమని చెబుతున్నారు.

# సాయినగర్‌లో ప్రజా సమస్యలపై గౌతమ్ గౌడ్ ఆకస్మిక పర్యటన



**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 13, శేరిలింగంపల్లి:**
సాయినగర్‌లో వాటర్ వర్క్స్ మేనేజర్ (గురునాథ్) ఏఈ (ప్రతాప్ ), వర్క్ ఇన్‌స్పెక్టర్లు దాస్ అండ్ ప్రసాద్ తో కలిసి కాంగ్రెస్ సీనియర్ నాయకులు బాల్లింగ్ గౌతమ్ గౌడ్ పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీ ప్రజలను కలిసి వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా నీటి సరఫరా మరియు ఇతర ఇబ్బందులపై ప్రజలు వివరించిన సమస్యలను పరిశీలించారు. ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఎల్లప్పుడూ ప్రజల మధ్యలో బాల్లింగ్ గౌతమ్ గౌడ్. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు అధికారులతో మాట్లాడి తగిన చర్యలు తీసుకుంటామని గౌతమ్ గౌడ్ హామీ ఇచ్చారు.

# భీమతోనే కుటుంబానికి భరోసా

**బీమా చేసుకోండి ధీమాగా ఉండండి..**

**శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ అసిస్టెంట్ మేనేజర్ అశోక్**



**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 13, నారాయణ ఖేడ్ :**
శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ నారాయణఖేడ్ బ్రాంచ్ ఆధ్వర్యంలో ఉపాధి హామీ కూలీలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ నారాయణఖేడ్ బ్రాంచ్ కల్హేర్ మండలంలోని మార్డి, బిబిపేట్, పత్తేపూర్ గ్రామాల ఉపాదా హామీ కూలీలకు జీవిత బీమా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సంస్థ అసిస్టెంట్ బ్రాంచ్ డెవలప్మెంట్ మేనేజర్ బైండ్ల అశోక్ మాట్లాడుతూ... కుటుంబానికి ఆర్థిక భద్రత కల్పిస్తుందని ఉపాధి హామీకులకు భీమ ముఖ్య ఉద్దేశాన్ని వివరించారు. ఆపత్కాల సమయంలో భీమా ఎంతో ఉపయోగపడుతుందని ప్రతి ఒక్కరూ బీమా తీసుకొని కుటుంబానికి భద్రత కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో డివో ప్రకాష్, సేల్స్ ఆఫీసర్స్ భూమేష్, ఫీల్డ్ అసిస్టెంట్ సాయిలు, పాల్గొన్నారు.

# వైద్య చికిత్స కోసం ఎల్.ఓ.సీ అందచేసిన ఎమ్మెల్యే శ్రీగణేష్



**సికింద్రాబాద్, జూన్ 13,హైదరాబాద్ పల్స్ ప్రతినిధి :**
కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ శనివారం తన నివాస కార్యాలయంలో నిరుపేద కుటుంబానికి 1 లక్ష రూపాయల విలువైన ఎల్.ఓ.సీని అందించారు. బోయిన్పల్లి చిన్న తోకట్ట ప్రాంతానికి చెందిన శరత్ కు 1,00,000/- ఎల్.ఓ.సీ మంజూరు చేయించారు. ఈ మొత్తాన్ని నిమ్స్ ఆసుపత్రిలో వారి చికిత్స నిమిత్తం ప్రభుత్వం నుండి అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీగణేష్ మాట్లాడుతూ పేదవాడి వైద్యానికి డబ్బు అడ్డు రాకూడదు. మీ ఆరోగ్యమే మా ప్రభుత్వ ప్రాధాన్యత కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ఆరోగ్యానికి ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు.

## గంగుల శ్రీనివాస్ ను కలిసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన బైరి కాలేందర్ గౌడ్..



**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 13, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :**
యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణంలోని పద్మావతి గార్డెన్ లో బిఆర్ఎస్ మండల అధ్యక్షులు గంగుల శ్రీనివాస్ పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించిన బిఆర్ఎస్ శ్రేణులు. బిఆర్ఎస్ నాయకులు కొలనుపాక గౌడ సంఘం మాజీ అధ్యక్షులు బైరి కాలేందర్ గౌడ్ శాలువాతో సత్కరించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కోటగిరి కృష్ణ బిఆర్ఎస్ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూమిని కాపాడాలి..పేదలకు ఇందిరమ్మ ఇండ్లు నిర్మించాలి

**సర్వే నెంబర్లు 157/1, 57లో అక్రమాలపై సమగ్ర విచారణ జరపాలి**

**రేపటి రిలే దీక్షకు ప్రజాప్రతినిధులు మద్దతు ఇవ్వాలి : ఎంఆర్పీఎస్ నాయకులు**

**సికింద్రాబాద్, జూన్ 13,హైదరాబాద్ పల్స్ న్యూస్ :** తిరుమలగిరి మండలం సర్వే నెంబర్ 157/1, బాలానగర్ మండలం సర్వే నెంబర్ 57 మధ్య ఉన్న భూములపై నెలకొన్న వివాదానికి సంబంధించి అధికారులు తక్షణమే జోక్యం చేసుకుని ప్రభుత్వ భూములను పరిరక్షించాలని ఎంఆర్పీఎస్ కంటోన్మెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఇటుక శ్రీకిషన్ మాదిగ, ఇటుక గోపి మాదిగ డిమాండ్ చేశారు. 2023లో ఈ భూములు కబ్జాకు గురవుతున్నాయని తిరుమలగిరి మండల తహసీల్దార్‌కు ఫిర్యాదు చేయగా, రెండు మండలాల మధ్య సరిహద్దు వివాదం ఉందని, పలు కోర్టు కేసులు పెండింగ్‌లో ఉండటంతో పాటు స్టేటస్‌కో ఉత్తర్వులు అమలులో ఉన్నాయని, భూములకు రిజిస్ట్రేషన్లు చేయరాదని ఎండార్స్‌మెంట్ లేఖ ఇచ్చినట్లు తెలిపారు. ఇదే విషయంపై బాలానగర్ మండల తహసీల్దార్ కూడా సర్వే నెంబర్లలో బార్డర్ వివాదం ఉన్నట్లు లిఖితపూర్వకంగా తెలిపారని పేర్కొన్నారు. బాలానగర్ మండలం సర్వే నెంబర్ 57 ప్రభుత్వ భూమిగా పహాణి రికార్డుల్లో నమోదై ఉందని, 2023లో కొందరు వ్యక్తులు దేవతా విగ్రహాలు ఏర్పాటు చేసేందుకు ప్రయత్నించినప్పుడు ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తున్నారనే కారణంతో బోయిన్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో కేసులు నమోదు చేసినట్లు గుర్తుచేశారు. రికార్డుల ప్రకారం ప్రభుత్వ భూమిగా ఉన్న స్థలాలు ఎలా ప్రైవేటు భూములుగా మారాయనే అంశంపై సమగ్ర దర్యాప్తు జరపాలని డిమాండ్ చేశారు. ఇదే సర్వే నెంబర్ 157/1లో ఇతరులకు రిజిస్ట్రేషన్లు ఎలా జరిగాయో అధికారులు ప్రజలకు సమాధానం చెప్పాలని కోరారు. కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ ప్రభుత్వ భూమిని కాపాడి, ఇండ్లు లేని పేదలకు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కోసం కేటాయించాలని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మంత్రి సీతక్కలకు లేఖ రాసిన విషయాన్ని వారు గుర్తుచేశారు. ప్రజా ప్రతినిధులు తీసుకున్న నిర్ణయానికి కట్టుబడి పేదల సంక్షేమం కోసం చర్యలు చేపట్టాలని కోరారు. ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించడం అధికారులతో పాటు ప్రజాప్రతినిధుల



బాధ్యత అని పేర్కొంటూ, ఈ నియోజకవర్గానికి చెందిన ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే శ్రీగణేష్, కంటోన్మెంట్ నామినేటెడ్ సభ్యురాలు భానుక నర్మదా ప్రభుత్వ భూముల పరిరక్షణకు ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు. రేపు నిర్వహించనున్న రిలే నిరాహార దీక్షకు ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే శ్రీగణేష్, నామినేటెడ్ సభ్యురాలు భానుక నర్మదా ప్రత్యక్షంగా హాజరై మద్దతు తెలపాలని, ప్రభుత్వ భూములను కాపాడి పేదల సంక్షేమానికి అండగా నిలవాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎంఆర్పీఎస్ నాయకులు, స్థానిక వడ్డెర సంఘం నాయకులు, చిరు వ్యాపారులు, స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ పార్టీకి అంకతి సుదర్శన్ సేవలు మరువలేనివి.....

**బిఆర్ఎస్ రాజపేట మండల పార్టీ అధ్యక్షులు సట్టు తిరుమలేష్ ....**



హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 13, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : బిఆర్ఎస్ పార్టీకి అంకతి సుదర్శన్ చేసిన సేవలు మరువలేనివని, ఆదర్శప్రాయుడని రాజపేట బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు సట్టు తిరుమలేష్ అన్నారు. శనివారం రాజపేటలో అంకతి సుదర్శన్ దశదిన, సంతాప కార్యక్రమానికి పలువురు హాజరై ఆయన చిత్రపటం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించిన సందర్భంగా మాట్లాడారు. సుదర్శన్ సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో జలసాధన సమితి కన్వీనర్ ఎర్రగోకుల జస్వంత్, రాజపేట పిఏసిఎస్ మాజీ వైస్ చైర్మన్ సందిల వెంకటేష్, నర్సాపురం మాజీ సర్పంచ్ నాగిర్తి గోపి, ఎమ్మ భాస్కర్, దూది వెంకటాపురం బిఆర్ఎస్ నాయకులు దగ్గుల విష్ణు తదితరులు ఉన్నారు

# ఆర్టీసీ ఉద్యోగుల విలీన ప్రక్రియలో యూనియన్లకు సముచిత ప్రాధాన్యం

**పారదర్శకంగా గుర్తింపు పొందిన సంఘాలకు కమిటీల్లో స్థానం**

**జేబీఎస్‌లో విలీన విధానాలపై వివరించిన ఈడీ అంచూరి శ్రీధర్, ఆర్ఎం సుచరిత**

**పికెట్, సికింద్రాబాద్, జూన్ 13,హైదరాబాద్ పల్స్ ప్రతినిధి :** టీజీఎస్ఆర్టీసీ ఉద్యోగుల ప్రభుత్వంలో విలీన ప్రక్రియను పారదర్శకంగా, ఉద్యోగుల ప్రయోజనాలను కాపాడే విధంగా అమలు చేయనున్నట్లు అధికారులు స్పష్టం చేశారు.ఈ మేరకు జూబ్లీ బస్ స్టేషన్‌లోని గ్రేటర్ హైదరాబాద్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చాంబర్‌లో జరిగిన సమావేశంలో విలీన ప్రక్రియకు సంబంధించిన విధివిధానాలపై విస్తృతంగా చర్చించారు.గ్రేటర్ హైదరాబాద్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అంచూరి శ్రీధర్,



సికింద్రాబాద్ రీజియన్ రీజినల్ మేనేజర్ సుచరిత విలీన విధానంపై వివరాలు వెల్లడించారు. విలీన ప్రక్రియలో ఉద్యోగ సంఘాలకు సముచిత ప్రాతినిధ్యం కల్పించాలని నిర్ణయించినట్లు తెలిపారు. యూనియన్ వెరిఫికేషన్ ద్వారా గుర్తింపు పొందిన (రికగ్నైజ్డ్) సంఘాలను సంబంధిత కమిటీల్లో సభ్యులుగా చేర్చి, విలీన ప్రక్రియలో భాగస్వామ్యం చేయనున్నట్లు పేర్కొన్నారు.ఉద్యోగ సంఘాల నుంచి వచ్చే సూచనలు, అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని సమగ్ర నిర్ణయాలు తీసుకుంటామని తెలిపారు. విలీన ప్రక్రియలో భాగంగా యూనియన్ వెరిఫికేషన్ నిర్వహించేందుకు ఇప్పటికే కార్మిక శాఖకు లేఖలు పంపినట్లు వెల్లడించారు. వెరిఫికేషన్ ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా జరిగేలా ఆర్టీసీ అధికారులు, పర్యవేక్షకులు అన్ని చర్యలు చేపడతారని స్పష్టం చేశారు.గుర్తింపు పొందిన యూనియన్లకు కమిటీల్లో ప్రాతినిధ్యం కల్పించి, వారి సూచనల మేరకు ఉద్యోగులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా విలీన ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. ఈ దిశగా ఆర్టీసీ అధికారులు పూర్తి సహకారం అందిస్తారని తెలిపారు.

# శ్రీ స్వామి వారి పాదాల చెంతన రేగు సిద్ధులు జన్మదిన వేడుకలు



**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 13, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** రాజపేట మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రేగు సిద్ధులు జన్మదిన వేడుకలు శనివారం యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి పాదాల చెంతన జరిగాయి. మండల నాయకులు జర్నలిస్టులు ఆయనకు శాలువా పూలమాలలతో సత్కరించి పుట్టినరోజు శుభాకాంక్షలు చెప్పారు. ఈ కార్యక్రమంలో మదర్ డైరీ డైరెక్టర్ సంధిల భాస్కర్ గౌడ్, ఆలేరు వ్యవసాయం మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ గుర్రం నరసింహులు, సీనియర్ జర్నలిస్టు ఠాగూర్ హిమ్మత్ సింగ్ తదితరులున్నారు

# విద్యార్థులకు 'బండి' బంపర్ ఆఫర్..
# టెన్త్ విద్యార్థులందరికీ ఉచితంగా సైకిళ్లు



**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 13, మెయిన్ డెస్క్:** కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అదిరిపోయే శుభవార్త చెప్పారు. గత ఏడాది లాగే ఈ ఏడాది కూడా 'మోదీ గిఫ్ట్' పేరుతో ప్రభుత్వ స్కూళ్లలో 10వ తరగతి చదివే విద్యార్థిని, విద్యార్థులందరికీ ఉచితంగా బ్రాండెడ్ సైకిళ్లను పంపిణీ చేయనున్నట్లు ఆయన ప్రకటించారు. దీంతో పాటు పేద విద్యార్థులపై ఆర్థిక భారం పడకుండా ఉండేందుకు, టెన్త్ క్లాస్ బోర్డు పరీక్ష ఫీజును కూడా తానే స్వయంగా చెల్లిస్తానని బండి సంజయ్ సంచలన ప్రకటన చేశారు.

**సొంత జీతంతో పరీక్ష ఫీజులు?:**

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లల్లో అత్యధికులు పేద, కార్మిక కుటుంబాలకు చెందినవారేనని, కనీసం పరీక్ష ఫీజు కట్టడానికి కూడా ఇబ్బంది పడే పరిస్థితులను తాను చూశానని బండి సంజయ్ పేర్కొన్నారు. అందుకే తన సొంత జీతం డబ్బుల నుండి నియోజకవర్గంలోని దాదాపు 12 వేల మందికి పైగా టెన్త్ విద్యార్థుల పరీక్ష ఫీజు మొత్తాన్ని చెల్లించనున్నట్లు తెలిపారు. అలాగే, దూర ప్రాంతాల నుంచి పాఠశాలలకు వచ్చే విద్యార్థుల ప్రయాణ కష్టాలను తీర్చేందుకు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సి.ఎస్.ఆర్) నిధులతో వేలాది సైకిళ్లను కొనుగోలు చేసి పంపిణీ చేయనున్నట్లు వివరించారు.ఒక ఎంపీగా గెలిచిన తర్వాత తన నియోజకవర్గంలోని ప్రభుత్వ స్కూల్ పిల్లల బాధ్యతను ఈ స్థాయిలో భుజానికెత్తుకోవడం దేశంలోనే ఇదే తొలిసారి అని ఆయన అనుచరులు చెబుతున్నారు. మంత్రి తీసుకున్న ఈ నిర్ణయంతో కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల, సిద్ధిపేట, హన్మకొండ జిల్లాల పరిధిలోని కరీంనగర్ లోక్‌సభ స్థానానికి చెందిన వేలాది మంది పేద విద్యార్థుల్లో సంతోషం వ్యక్తమవుతో

# నేలమట్టమైన ఇల్లు అందజేసిన ఆర్థిక సాయం



**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 13, భద్రాద్రి కొత్తగూడెం :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం ఆర్ కొత్తగూడెం ఎస్సీ కాలనీకి చెందిన కూరపాటి. వెంకటేశ్వరరావు పూర్తిగా నిరుపేద కుటుంబం ఇటివలే వీచిన గాలి దుమారానికి తను నివాసం ఉంటున్న రేకుల షెడ్డు పూర్తిగా గాలి దుమారానికి లేచిపోయి ఉండటానికి నిలువ నీడ లేకుండా పోయింది. ఇల్లు బాగు చేసుకునే స్తోమత లేక మీకోసం మేమున్నం సంస్థను ఆశ్రయించగా ఫండ్ రైసింగ్ పోస్ట్ ద్వారా దాతల వద్ద నుండి సేకరించిన 9,500 నగదును మీకోసం మేమున్నాం కార్యాలయంలో శనివారం సంస్థ సభ్యులు కార్తికేయ రోహిత్ చేతుల మీదుగా కూరపాటి. వెంకటేశ్వరావు కుటుంబానికి అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా సంస్థ చైర్మన్ లయన్ నీలి ప్రకాష్ మాట్లాడుతూ అనుకొని ప్రకృతి విపత్తుల వలన నిరుపేద కుటుంబం రోడ్డున పడ్డ పరిస్థితిని చూసి చలించి పోవడం జరిగిందని పేదవారు కష్టంలో ఉన్నప్పుడు మనమంతా తలా ఓ చేయి వేసి సాయం అందిస్తే వారికి ఎంతో మేలు జరుగుతుందని భావించి ఆ కుటుంబానికి ఆర్థిక సాయం అందజేయడం జరిగిందని ఆ కుటుంబానికి అండగా నిలబడి సహాయం అందించిన దాతలందరికీ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీ.వి. ప్రతాప్, దొడ్డి.సూరిబాబు, సొల్లంగి. నాగేశ్వరరావు, కవ్వాల. రాము, మామిడి. సాయి, రామ్మోహన్ రావు, మెంతుల. వీర్రాజు, తదితరులు పాల్గొన్నారు.

# చైనా 'నయా అస్త్రం'తో...
# భారత్ పై బుసలు కొడుతున్న పాకిస్థాన్

**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 13, సెంట్రల్ డెస్క్ :** భారత్ కు సరిహద్దు దేశాలైన పాకిస్థాన్, చైనాలతో ఎప్పుడూ ముప్పు పొంచి ఉంటూనే ఉంది. ఇప్పటికే దశాబ్దాలుగా అటు పాకిస్థాన్, ఇటు చైనాతో భారత్ అనేక సమస్యలు, సవాళ్లను ఎదుర్కొంటోంది. అయినా ఏనాడు ఆ శత్రు దేశాలకు తలవంచకుండా ఆ దేశాల కుయుక్తులను, కుట్రలను ఎప్పటికప్పుడు తిప్పి కొడుతూ ఆసియా ఖండంలోనే అగ్ర శక్తిగా భారత్ అవతరిస్తోంది. ఇక గతేడాది పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత పాకిస్థాన్ పై భారత్ ఆపరేషన్ సింధూర్ చేపట్టింది. అయితే ఈ యుద్ధ సమయంలో చైనా, టర్కీ అందించిన డ్రోన్ లు, క్షిపణులను భారత్ పై ప్రయోగించింది పాకిస్థాన్.. కానీ వాటిని భారత్ కు చెందిన ఎస్-400 డిఫెన్స్ వ్యవస్థ సమర్థవంతంగా నేలకూల్చింది.ఇక పాకిస్థాన్ ప్రతి విషయంలోనూ చైనాపై ఆధారపడుతున్న సంగతి తెలిసిందే. చైనా అందిస్తున్న టెక్నాలజీ, ఢిఫెన్స్ సాయంతో భారత్ పై కుట్రలు పన్నుతోంది పాకిస్థాన్. ఇప్పటివరకూ పాకిస్థాన్ కు చైనానే అత్యధిక ఆయుధాలు సరఫరా చేసిన దేశంగా నిలుస్తూ వస్తోంది. పాకిస్థాన్ వద్ద ఉన్న ఆయుధాల్లో దాదాపు 82 శాతం చైనా సరఫరా చేసినవే కావడం గమనార్హం. అయితే గత ఐదేళ్లలో వీటి సరఫరా మరింత



పెరిగినట్లు భారత నిఘా వర్గాలు తేల్చేస్తున్నాయి. దీంతో మేడ్ ఇన్ చైనా ఆయుధాలతో పాకిస్థాన్.. భారత్ తో కయ్యానికి కాలు దువ్వుతున్నట్లుగా తెలుస్తోంది.అయితే తాజాగా చైనా అత్యాధునిక టెక్నాలజీతో నిర్మించిన హంగోర్ జలాంతర్గామి పాకిస్థాన్ కు చేరుకుంది. ఈ మేరకు తాజాగా హంగోర్ జలాంతర్గామి పాకిస్థాన్ లోని కరాచీ తీరానికి చేరింది. ఇలాంటివి మొత్తం 8 జలాంతర్గాములను కొనుగోలు చేసేందుకు చైనాతో పాకిస్థాన్ ఒప్పందం కుదుర్చుకుంది. అయితే వీటిలో నాలుగింటిని చైనా నిర్మిస్తుండగా మరో నాలుగింటిని టెక్నాలజీ ట్రాన్స్ ఫర్ కింద పాకిస్థాన్ లోని కరాచీ షిప్ యార్డ్ లోనే నిర్మిస్తున్నారు. ఇక 2028-30 నాటికి ఈ ఎనిమిది జలాంతర్గాములు పాకిస్థాన్ కు అందుబాటులోకి రానున్నట్లు స్పష్టం అవుతోంది.హంగోర్ జలాంతర్గామికి చాలా శక్తి సామర్థ్యాలే ఉన్నాయి. ఇవి ప్రత్యర్థి కంటపడకుండా దాడి చేసే సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయి. ఇవి ఒక్కోటి దాదాపు 2,500 నుంచి 2,800 టన్నుల బరువు ఉంటాయి. ఇవి సముద్రంలో గంటకు 35 కి. మీ. వేగానికి పైగా ప్రయాణిస్తాయి. ఈ జలాంతర్గామి గరిష్ఠంగా 300 మీటర్ల లోతు వరకు వెళ్లగలదు. ఒక్కో జలాంతర్గామిలో గరిష్ఠంగా 38 మంది సిబ్బంది, 8 మంది స్పెషల్ ఫోర్స్ కమాండోలు ప్రయాణించవచ్చు. తాజాగా వీటి సరఫరాతో భారత్ అప్రమత్తమైంది. పాకిస్థాన్ కదలికల్ని క్షుణ్ణంగా గమనిస్తోంది.ఇక ఇప్పటికే చైనా నుంచి జేఎఫ్ 17 థండర్ ఫైటర్ జెట్లు, జే 10 సీఈ ఫైటర్ జెట్లు, టైప్ 05 ఏ ఫ్రిగేట్స్, టైప్ 041 హాంగర్ క్లాస్ సబ్ మెరైన్స్, వింగ్ లూంగ్ 2 డ్రోన్స్ , జెడ్ 10ఎమ్ ఈ ఎటాక్ హెలికాప్టర్స్, హెచ్ క్యూ 9 డిఫెన్స్ సిస్టమ్స్, ఎస్ హెచ్ 15 సెల్ఫ్ ప్రొపెల్డ్ ఆర్టిలరీ, పీఎల్ 15 మిసైల్స్ లాంటి అత్యాధునిక ఆయుధాలను పాకిస్థాన్ కొనుగోలు చేసిన విషయం తెలిసిందే.

హైదరాబాద్ పల్స్

## దత్తగిరిలో వైభవంగా
# శని త్రయోదశి పూజలు


ప్రత్యేక పూజల్లో పాల్గొన్న జహీరాబాద్ ఆర్డీవో
కుటుంబ సమేతంగా మొక్కులు చెల్లించిన ఆర్డీవో



**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 13, జహీరాబాద్:**
సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండలంలోని బర్దిపూర్ గ్రామంలో ఉన్న శ్రీ దత్తగిరి మహారాజ్ ఆశ్రమంలో వెలసిన శ్రీ శనీశ్వర స్వామి దేవాలయంలో శనివారం శని త్రయోదశి సందర్భంగా భక్తులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జహీరాబాద్ ఆర్డీవో దేవుజా కుటుంబ సమేతంగా ఆలయానికి విచ్చేసి శ్రీ శనీశ్వర స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆశ్రమ ప్రాంగణంలోని జ్యోతిర్లింగాలు, పంచవృక్షాలు, శ్రీ దత్తాత్రేయ స్వామివారిని దర్శించుకుని ఆశీర్వాదాలు పొందారు. ఆర్డీవోకు ఆశ్రమ పీఠాధిపతి శ్రీ అవధూతగిరి మహారాజ్ పూలమాలలతో సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు. శని త్రయోదశి సందర్భంగా ఆశ్రమంలో భక్తుల రద్దీ నెలకొంది.

# శ్రీ వేంకటేశ్వపర స్వామి వారికి మండల పూజా మహోత్సవం...





**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 13, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :**
యాదాద్రి భువనగిరి జిల్లా, రాజపేట మండలం రేణికుంట గ్రామంలో శ్రీమతి బోళ్ల ఇందిర నర్సిరెడ్డి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ వేంకటేశ్వర స్వామివారి 41 రోజుల మండల పూజా కార్యక్రమం శనివారం ఉదయం 9:30 నీ లకు పంచామృత అభిషేక మహోత్సవం వైభవంగా ఆలయ అర్చకులు శ్రీ రేగొండ పాండురంగం సమక్షంలో నిర్వహించారు. గత మాసంలో శ్రీ వేంకటేశ్వర స్వామి వారి విగ్రహ ప్రతిష్ట జరిగి శనివారం రోజు నాటికి మండలం (41)వ రోజున శనివారం ఉదయం 9 గంటలకు ఆలయ అర్చకులు శ్రీ రేగొండ పాండురంగం పూజా కార్యక్రమం జరిగింది. ముందుగా కలశ ఆరాధన మహాగణపతి పూజ నిర్వహించుకొని తదనంతరం శ్రీవారికి పాలు, పెరుగు, నెయ్యి, తేనే, పంచదారలతో విశేష పంచామృత అభిషేకం, నిర్వహించి నూతన వస్త్రాలతో అలంకరణ అష్టోత్తర శతనామార్చన గావించి పంచ హారతి నక్షత్ర హారతి మహా మంగళహారతి నీరాజం ఇవ్వటం జరిగింది. భక్తులు హరినామ సంకీర్తన చేయటం జరిగింది అనంతరం ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలు అందించగా బోళ్ళ ఇందిరా నర్సిరెడ్డి అన్న ప్రసాదం అందించటం జరిగింది.

# హైదరాబాద్ పోలీసుల సంచలనం... ఏడుగురు బంగ్లాదేశీయుల అరెస్ట్




**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 13, తెలంగాణ బ్యూరో:** హైదరాబాద్ నగరంలోని జీడిమెట్ల పరిధిలో అక్రమంగా నివసిస్తున్న ఏడుగురు బంగ్లాదేశీయులను పోలీసులు అరెస్టు చేశారు. నిఘా వర్గాల పక్కా సమాచారంతో గాజులరామారం హెచ్ఏఎల్ కాలనీలోని ఓ అద్దె ఇంట్లో పోలీసులు సోదాలు నిర్వహించారు. వీసా, పాస్‌పోర్టు లాంటి ఎలాంటి చట్టబద్ధమైన పత్రాలు లేకుండా వారు అక్రమంగా దేశంలోకి ప్రవేశించి నివసిస్తున్నట్లు నిర్ధారించుకొని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం తదుపరి చర్యల నిమిత్తం మెదక్ జిల్లా జోగిపేటలోని డిపోర్టేషన్ కేంద్రానికి తరలించారు.

**గుర్తించు-తొలగించు-బహిష్కరించు:**
ఇదిలా ఉండగా.. 'గుర్తించు-తొలగించు-బహిష్కరించు' అనే వ్యూహంతో ఇప్పటికే పశ్చిమ బెంగాల్‌లో అక్రమ వలసదారులపై ఉక్కుపాదం మోపుతున్న విషయం తెలిసిందే. అనుమానిత చొరబాటుదారులను తక్షణమే దేశం విడిచి వెళ్లాలని ముఖ్యమంత్రి సువేందు అధికారి హెచ్చరించడంతో పాటు, 23 జిల్లాల్లో ప్రత్యేక 'నిర్బంధ కేంద్రాలను' ఏర్పాటు చేశారు. గతంలో ఆగిపోయిన ఈ బహిష్కరణ ప్రక్రియను మళ్లీ వేగవంతం చేశారు. అలాగే.. ప్రభుత్వ కఠిన చర్యలతో వందలాది మంది అక్రమ బంగ్లాదేశీయులు బితారి – హకింపూర్ సరిహద్దుల ద్వారా స్వదేశానికి వెళ్లేందుకు బారులు తీరుతున్నారు. పశ్చిమ బెంగాల్‌లో ముమ్మరంగా సాగుతున్న ఈ తరలింపు ప్రక్రియ ఇప్పుడు తెలంగాణలోనూ కనిపిస్తుండటం గమనార్హం.

# ఇంటి దారి మూసివేతతో తల్లి, ముగ్గురు కుమార్తెలు ఇంటికే బందీ

**మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం మహమూద్‌పట్నంలో హృదయ విదారక ఘటన**
**నాలుగు రోజులుగా ఇంటి నుంచి బయటకు రాలేక అవస్థలు**
**అధికారులను ఆశ్రయించినా ఫలితం లేదని బాధిత కుటుంబం ఆవేదన**



**హైదరాబాద్ పల్స్, జూన్ 13, మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి :**
మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం మహమూద్‌పట్నం గ్రామంలో ఓ తల్లి, ఆమె ముగ్గురు కుమార్తెలు నాలుగు రోజులుగా ఇంటికే పరిమితమై దయనీయ పరిస్థితుల్లో జీవనం సాగిస్తున్న ఘటన వెలుగులోకి వచ్చింది. ఇంటికి వెళ్లే ఏకైక దారిని ముళ్ల కంచెతో మూసివేయడంతో కుటుంబ సభ్యులు బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. బాధితురాలు పెరుమళ్ల లక్ష్మి కథనం ప్రకారం, తన భర్త కృష్ణయ్యతో కలిసి 18 సంవత్సరాల క్రితం ఏశబోయిన కోమరయ్య వద్ద నుంచి ఇంటి స్థలాన్ని, ఇంటి దారితో సహా పెద్దల సమక్షంలో కొనుగోలు చేసినట్లు తెలిపారు. అప్పటి నుంచి అదే స్థలంలో నివాసం ఉంటూ జీవనం సాగిస్తున్నామని చెప్పారు. భర్త మరణం అనంతరం ఏశబోయిన శ్రీను తమకు ఇంటి దారి లేదంటూ వివాదం సృష్టిస్తూ వేధింపులకు పాల్పడుతున్నాడని ఆరోపించారు. గతంలో కూడా దారిని అడ్డుకోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించినట్లు తెలిపారు. అయితే నాలుగు రోజుల క్రితం తమ కుటుంబ సభ్యులు ఇంటి వద్ద లేని సమయంలో పక్కనే నివసించే మేకల సునిత ముళ్ల కంచె ఏర్పాటు చేసి ఇంటి దారిని పూర్తిగా మూసివేసిందని ఆరోపించారు. దీంతో ఇంటి నుంచి బయటకు రావడం, నిత్యావసర వస్తువులు తెచ్చుకోవడం, తాగునీరు సేకరించడం కూడా కష్టంగా మారిందని వాపోయారు. మంచినీరు అందక ఉప్పునీటితోనే రోజులు గడుపుతున్నామని, మహిళలమే ఉన్న కుటుంబం కావడంతో తీవ్ర భయాందోళనలకు గురవుతున్నామని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. సమస్య పరిష్కారం కోసం అధికారుల చుట్టూ తిరిగినా స్పందన ఆవేదన వ్యక్తం చేసింది. తమ వద్ద ఉన్న భూమి కొనుగోలు పత్రాలు, ఇతర ఆధారాలను పరిశీలించి ఇంటి దారిని వెంటనే పునరుద్ధరించాలని, తమను వేధిస్తున్నట్లు ఆరోపిస్తున్న ఏశబోయిన శ్రీను, మేకల సునితలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బాధిత కుటుంబం జిల్లా అధికారులను, పోలీసు శాఖను వేడుకుంది.

# తృణమూల్ ను ఊపిరిసలపనివ్వని ముఖ్యమంత్రి సువేందు



**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 13, బెంగాల్:**
పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు సంబంధించిన సంతకాల ఫోర్జరీ ఆరోపణల కేసు దర్యాప్తు ముమ్మరం అయింది. ఈ కేసులో సీఐడీ దూకుడుగా వ్యవహరిస్తోంది. ఇప్పటివరకు 13 మంది ఎమ్మెల్యేల వాంగ్మూలాలను నమోదు చేసింది. ఈ వ్యవహారంలో ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి, లోక్ సభ సభ్యుడు అభిషేక్ బెనర్జీ ఆరోపణలను ఎదుర్కొంటోన్నారు. ఆయనకు సీఐడీ తాజాగా నోటీసులు జారీ చేయడం ప్రాధాన్యతను సంతరించుకుంది. అదే సమయంలో ఆయన నివాసంపై కలకత్తా పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. కేంద్ర బలగాలు సైతం ఇందులో పాలుపంచుకోవడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ తెల్లవారు జామున 3 గంటల సమయంలో కలకత్తా కాళీఘాట్ లోని నివాసంలో ఈ సోదాలు ఆరంభం అయ్యాయి. ఉదయం వరకూ కొనసాగాయి. కేంద్ర భద్రతా బలగాల పర్యవేక్షణలో అత్యంత నాటకీయ పరిణామాల మధ్య సాగిన ఈ ఆపరేషన్ పశ్చిమ బెంగాల్ రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. అభిషేక్ బెనర్జీ వ్యక్తిగత సహాయకుడు సుమిత్ రాయ్‌కు సంబంధించిన ఓ కేసు ఆధారంగా ఈ సోదాలు జరిగినట్లు తెలుస్తోంది. నాలుగు గంటల పాటు సాగిన ఈ శోధన ముగిసిన అనంతరం అభిషేక్ విలేకరులతో మాట్లాడారు. తాళం పగలగొట్టి, ఇంట్లోకి ప్రవేశించి ప్రతి గదిలోనూ సోదాలు చేశారని ఆరోపించారు. ఈ పోలీస్ ఆపరేషన్ విషయం తెలియగానే మాజీ ముఖ్యమంత్రి, టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ ఆయన నివాసానికి చేరుకున్నారు. రాజకీయ కక్షసాధింపు చర్యలకు అడ్డు అదుపు ఉండట్లేదని, నానాటికీ దిగజారుతున్నాయని మండిపడ్డారు. అసెంబ్లీ సంతకాల ఫోర్జరీ కేసులో అభిషేక్ బెనర్జీని ఇటీవలే సీఐడీ అధికారులు దాదాపు ఆరు గంటల పాటు అభిషేక్ ను సంగతి తెలిసిందే. ఈ విచారణ ముగిసిన రెండు రోజుల వ్యవధిలోనే ఆయన నివాసంపై జరిగిన ఈ తాజా దాడి తృణమూల్ నేతల్లో తీవ్ర ఆగ్రహాన్ని తెప్పించింది. దర్యాప్తు సంస్థలు మరోసారి ఆయనకు సమన్లు ఇచ్చే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. మరోవైపు, పశ్చిమ బెంగాల్‌లో టీఎంసీ సీనియర్ నాయకుడు, ఎమ్మెల్యే మదన్ మిత్ర కూడా టార్గెట్ అయ్యారు. ఆయనకు చెందిన నివాసాలు, కార్యాలయాలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఏకకాలంలో ఏడు చోట్ల సోదాలు నిర్వహించింది. మున్సిపల్ నియామకాల కుంభకోణంలో భాగంగా దక్షిణేశ్వర్‌లోని ఆయన నివాసంలో ఈ తనిఖీలు చేపట్టారు. సుమారు 125 కంటే ఎక్కువ అక్రమ నియామకాలతో మిత్రాకు సంబంధాలు ఉన్నాయని, దళారుల ద్వారా ఆయన పెద్ద ఎత్తున లంచాలు తీసుకున్నారని ఈడీ అధికారులు ప్రాథమికంగా ఆరోపిస్తున్నారు.

# పాక్‌కు రాజ్‌నాథ్ సింగ్ స్ట్రాంగ్ వార్నింగ్..

## సింధు నదీ జలాలు ఉగ్రవాద పోషకులకు చేరనివ్వం..!



**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 13, సెంట్రల్ బ్యూరో:**
రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పాకిస్థాన్‌కు గట్టి హెచ్చరిక జారీ చేస్తూ, సింధు నదీ జలాలు ఉగ్రవాద పోషకులకు చేరకుండా చూస్తామని స్పష్టం చేశారు. శాంతి భాషను అర్థం చేసుకోని వారికి ఎలా బదులివ్వాలో భారత్‌కు బాగా తెలుసని పేర్కొన్న ఆయన, పాకిస్థాన్ సరిహద్దు ఆవల నుంచి సాగించే ఉగ్రవాదాన్ని పూర్తిగా నిలిపివేసేంత వరకు నీటి పంపిణీ ఒప్పందం నిలిపివేయబడే ఉంటుందని తేల్చిచెప్పారు. హైదరాబాద్‌లో జరిగిన 'మేధావుల సదస్సు'లో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన 'ఆపరేషన్ సింధూర్' గురించి, అలాగే పహల్గామ్ ఉగ్రవాద దాడి అనంతరం సింధు జలాల ఒప్పందం నిలిపివేత గురించి ప్రస్తావించారు. శాంతి, సామరస్యాల భాషను అర్థం చేసుకోని వారికి ఎలా స్పందించాలో తమకు తెలుసని 'ఆపరేషన్ సింధూర్' ద్వారా ప్రభుత్వం ప్రపంచానికి చాటిచెప్పిందని ఆయన అన్నారు. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఇలా అన్నారు.. "పహల్గామ్ ఉగ్రవాద దాడి తర్వాత, సింధు జలాల ఒప్పందాన్ని నిలిపివేయడం ద్వారా, ఎవరి కన్నీళ్లు ఇంకిపోయాయో వారు ఇక మా నుంచి నీటిని ఆశించకూడదనే సందేశాన్ని మేము స్పష్టం చేశాము. ఉగ్రవాదులకు అండగా నిలిచేవారికి, మానవాళికి శత్రువులైన వారికి సింధు నదీ జలాలు చేరకుండా మేము అడ్డుకుంటామన్నారు. సింధు నదీ వ్యవస్థ నీటి వినియోగానికి సంబంధించిన చారిత్రాత్మక 'సింధు జలాల ఒప్పందం' పై 1960 సెప్టెంబర్ 19న భారత్, పాకిస్థాన్ మధ్య సంతకాలు జరిగాయి. అయితే, గత ఏడాది పహల్గామ్‌లో జరిగిన ఘోర ఉగ్రవాద దాడి తర్వాత భారత్ కఠిన వైఖరిని అవలంబించింది. అంతర్జాతీయ చట్టం ప్రకారం సార్వభౌమ దేశంగా తనకున్న హక్కులను వినియోగించుకుంటూ సరిహద్దు ఆవల నుంచి సాగే ఉగ్రవాదాన్ని పాకిస్థాన్ పూర్తిగా, విశ్వసనీయంగా నిలిపివేసేంత వరకు భారత్ ఈ ఒప్పందాన్ని నిలిపివేయనుంది.

# పోలీసుల డెకాయ్ ఆపరేషన్.. లింగ నిర్ధారణ రాకెట్ గుట్టు రట్టు, ముగ్గురు అరెస్ట్.!



**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 13, తెలంగాణ బ్యూరో:**
హైదరాబాద్ వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమంగా గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్న ఒక పెద్ద రాకెట్‌ను పోలీసులు అత్యంత చాకచక్యంగా ఛేదించారు. వనస్థలిపురంలోని 'హయగ్రీవ హాస్పిటల్' వేదికగా ఈ అక్రమ దందా సాగుతోందని నమ్మదగిన సమాచారంతో పోలీసులు రంగంలోకి దిగారు. పక్కా ప్లాన్ ప్రకారం ఒక మహిళా పోలీసు అధికారిని గర్భిణిగా నటింపజేస్తూ (డెకాయ్ ఆపరేషన్) సదరు ఆసుపత్రికి పంపించారు. ఈ ఆపరేషన్ విజయవంతం కావడంతో హాస్పిటల్ డైరెక్టర్ కొర్ర రాజు, రిసెప్షనిస్ట్ లోకేష్‌తో పాటు తుక్కుగూడలోని శ్రీ సాయి ధనుష్ క్లినిక్‌కు చెందిన ల్యాబ్ టెక్నీషియన్ విజయ్ కుమార్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు పంపిన మహిళా డెకాయ్ సిబ్బంది హయగ్రీవ ఆసుపత్రికి వెళ్లినప్పుడు, హాస్పిటల్ డైరెక్టర్ కొర్ర రాజు, రిసెప్షనిస్ట్ లోకేష్ ఆమెను నమ్మారు. పుట్టబోయే బిడ్డ ఆడా, మగా అనే విషయాన్ని తాము నిర్ధారిస్తామని సదరు మహిళకు వారు హామీ ఇచ్చారు. ఇందుకోసం తమకు ముందే పరిచయం ఉన్న తుక్కుగూడలోని ల్యాబ్ టెక్నీషియన్ విజయ్ కుమార్‌ను సంప్రదించాలని, అతను స్కానింగ్ చేసి ఖచ్చితమైన వివరాలు చెబుతాడని నమ్మబలికారు. దళారుల వ్యూహాన్ని గమనించిన పోలీసులు నిందితుల కదలికలపై నిఘా ఉంచారు. హాస్పిటల్ నిర్వాహకులు ఇచ్చిన సమాచారం ఆధారంగా పోలీసులు వెంటనే తుక్కుగూడలోని 'శ్రీ సాయి ధనుష్ క్లినిక్' ల్యాబ్‌పై ఆకస్మిక దాడి (రైడ్) చేశారు. అక్కడ క్లినిక్ నిబంధనలకు విరుద్ధంగా లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్ విజయ్ కుమార్‌ను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అక్రమంగా భ్రూణ లింగ నిర్ధారణ చేస్తూ చట్టాన్ని ఉల్లంఘిస్తున్న ముగ్గురు నిందితులపై వనస్థలిపురం పోలీసులు వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేసి, లోతుగా దర్యాప్తు ప్రారంభించారు. ఈ సందర్భంగా వనస్థలిపురం పోలీసులు ప్రజలకు, ప్రైవేట్ క్లినిక్ నిర్వాహకులకు గట్టి హెచ్చరికలు జారీ చేశారు. కేంద్ర ప్రభుత్వ (గర్భధారణ పూర్వ, ప్రసవ పూర్వ రోగనిర్ధారణ పద్ధతుల) చట్టం ప్రకారం గర్భంలో ఉన్న శిశువు లింగాన్ని పరీక్షించడం గానీ, ఆ వివరాలను తల్లిదండ్రులకు వెల్లడించడం గానీ శిక్షార్హమైన నేరమని స్పష్టం చేశారు. ఈ చట్టాన్ని ఉల్లంఘించే వారిపై ఎంతటి వారైనా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమాజంలో ఆడపిల్లల పట్ల ఉన్న లింగ వివక్షకు వ్యతిరేకంగా ప్రతి ఒక్కరూ పోరాడాలని పిలుపునిచ్చారు. నగరంలో ఎక్కడైనా ఇలాంటి అక్రమ లింగ నిర్ధారణ పరీక్షలు జరుగుతున్నట్లు సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని విజ్ఞప్తి చేశారు.

# నేడు ఖేడ్ లో ఓటర్ల జాబితా సవరణపై ప్రత్యేక అవగాహన సదస్సు

**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 13, నారాయణఖేడ్ :**
భారత ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియ (స్పెషల్ ఇంటెన్సివ్ రెవిషన్ - యస్ ఐ ఆర్)పై అవగాహన కల్పించేందుకు రేపు (ఆదివారం) నారాయణఖేడ్ పట్టణంలో భారీ అవగాహన సదస్సును ఏర్పాటు చేసినట్లు స్థానిక శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి తెలిపారు. ఏఐసీసీ (ఏఐసీసీ) మరియు తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) అధిష్టానం ఆదేశాల మేరకు నేడు (ఆదివారం) ఉదయం 10:00 గంటలకు నారాయణఖేడ్ లోని జీవన్ ఫంక్షన్ హాల్‌లో ఈ నియోజకవర్గ స్థాయి సదస్సు నిర్వహించబడుతుంది. ఈ ప్రాధాన్యత కలిగిన సమావేశంలో జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ కుమార్ శేట్కర్ నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి ఏఐసీసీ జనరల్ సెక్రెటరీ సచిన్ సావంత్, జిల్లా ఇన్చార్జ్ మరియు రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ ఫయీమ్, మరియు ముఖ్య శిక్షకులు (ట్రైనర్) రాజీవ్ పాల్గొని, ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై, బూత్ స్థాయి ఏజెంట్లు అనుసరించాల్సిన వ్యూహాలపై దిశానిర్దేశం చేయనున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ పి.సంజీవరెడ్డి ప్రతి బూత్ స్థాయిలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే లక్ష్యంగా, ఓటర్ల జాబితాలో ఎటువంటి లోటుపాట్లు, అక్రమాలకు తావు లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కావున నారాయణఖేడ్ నియోజకవర్గం లోని అన్ని మండలాల: కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, బూత్ లెవెల్ ఏజెంట్లు (బి ఎల్ ఏ యస్ ) సర్పంచులు, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు (మాజీ ప్రజాప్రతినిధులతో సహా) కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘాల ప్రజాప్రతినిధులు, గ్రామస్థాయి యువ నాయకులు, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా పాత్రికేయ మిత్రులు, అందరూ కూడా ఈ అవగాహన సదస్సుకు సకాలంలో హాజరై, సవరణ ప్రక్రియకు సంబంధించిన సాంకేతిక, చట్టపరమైన అంశాలను తెలుసుకొని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.



# ప్రైవేట్ విద్యా దోపిడీకి చెక్ పెట్టాలి

## బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు ఎల్. విజయ్‌కాంత్ డిమాండ్

**హైదరాబాద్ పల్స్, జూన్ 13, మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి:**
తెలంగాణ రాష్ట్రంలో విద్య హక్కుగా కాకుండా ఖరీదైన వస్తువుగా మారిపోతోందని, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ఫీజుల పేరుతో ప్రజలను బహిరంగంగా దోచుకుంటున్నాయని బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు ఎల్. విజయ్‌కాంత్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. డోర్నకల్ మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కొత్త విద్యా సంవత్సరం ప్రారంభమైన ప్రతిసారీ తల్లిదండ్రులు ఆనందం కంటే ఆందోళనతోనే పిల్లలను పాఠశాలలకు పంపే పరిస్థితి ఏర్పడిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు ఎలాంటి నియంత్రణ లేకుండా తమకు నచ్చిన విధంగా ఫీజులను పెంచుతున్నాయని ఆయన ఆరోపించారు. విద్యార్థుల భవిష్యత్తును సాకుగా చూపుతూ వేల రూపాయల నుంచి లక్షల రూపాయల వరకు ఫీజులు వసూలు చేస్తున్నారని, దీనివల్ల సాధారణ కుటుంబాలు తీవ్ర ఆర్థిక సంక్షోభంలోకి నెట్టబడుతున్నాయని పేర్కొన్నారు. విద్యను అందరికీ అందుబాటులో ఉంచాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉండగా, ప్రస్తుతం విద్య ధనవంతులకు మాత్రమే పరిమితమవుతున్న ప్రమాదకర పరిస్థితి నెలకొందని ఆందోళన వ్యక్తం చేశారు. పాఠశాలలు కేవలం ట్యూషన్ ఫీజులతోనే ఆగకుండా యూనిఫారాలు, పుస్తకాలు, నోట్‌బుక్స్, ట్రాన్స్‌పోర్ట్, డిజిటల్ క్లాసులు, ప్రత్యేక శిక్షణ పేర్లతో అదనపు రుసుములు వసూలు చేస్తున్నాయని విమర్శించారు. కొన్ని విద్యాసంస్థలు తల్లిదండ్రులకు ప్రత్యామ్నాయం లేకుండా తమ వద్దే పుస్తకాలు, యూనిఫారాలు కొనుగోలు చేయాలని ఒత్తిడి తెస్తున్నాయని ఆరోపించారు. పిల్లల చదువులు ఆగిపోకూడదనే ఆందోళనతో అనేక కుటుంబాలు అప్పులు చేసి అయినా ఫీజులు చెల్లిస్తున్నాయని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతంపై దృష్టి పెట్టాల్సిన సమయంలో ప్రైవేట్ విద్యా వ్యవస్థ నిరంకుశంగా పెరుగుతోందని ఆయన అన్నారు. ఫీజుల నియంత్రణ కోసం అనేక సంవత్సరాలుగా చట్టం తీసుకువస్తామని చెబుతున్నప్పటికీ ఇప్పటివరకు అమలు కాకపోవడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని విమర్శించారు. ఇతర రాష్ట్రాల్లో ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేసి పాఠశాలల ఖర్చులను పరిశీలించి ఫీజులను నిర్ణయిస్తుండగా, తెలంగాణలో మాత్రం విద్యాసంస్థలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయని పేర్కొన్నారు. విద్యా హక్కు చట్టం ప్రకారం పేద మరియు వెనుకబడిన వర్గాల పిల్లలకు అందాల్సిన అవకాశాలు పూర్తిస్థాయిలో అమలు కావడం లేదని ఆయన అన్నారు. ఫీజుల పెంపుపై పర్యవేక్షణ లేకపోవడం, ప్రైవేట్ విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోకపోవడం వల్ల తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం వెంటనే సమగ్ర ఫీజు నియంత్రణ చట్టాన్ని తీసుకురావాలని, జిల్లా స్థాయిలో ఫీజు పర్యవేక్షణ




కమిటీలను ఏర్పాటు చేయాలని, ప్రతి విద్యాసంస్థ తన ఫీజుల వివరాలను ప్రజలకు బహిరంగంగా వెల్లడించే విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. అక్రమంగా అధిక ఫీజులు వసూలు చేసే పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు అవసరమైతే గుర్తింపును కూడా రద్దు చేయాలని కోరారు. విద్య అనేది వ్యాపార వస్తువు కాదని, అది ప్రతి చిన్నారికి రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కు అని విజయ్‌కాంత్ స్పష్టం చేశారు. ఆ హక్కును కాపాడడం ప్రభుత్వాల నైతిక బాధ్యత అని పేర్కొంటూ, ఫీజుల భారంతో నలిగిపోతున్న లక్షలాది తల్లిదండ్రుల సమస్యలను ప్రభుత్వం అత్యవసరంగా పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో డోర్నకల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బందెల కిరణ్‌కుమార్, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# గౌరాయిపల్లి కుమ్మరుల నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నిక....

### కుమ్మరుల ఐక్యతతో రాజకీయ చైతన్యం సాధ్యం.....

### యాదాద్రి భువనగిరి జిల్లా ప్రధాన కార్యదర్శి దరిపల్లి ప్రవీణ్ కుమార్

హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 13, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : శనివారం రోజున యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలం గౌరాయిపల్లి గ్రామం కుమ్మరుల నూతన కమిటీని భువనగిరిలోని కృషి ఐటిఐ కళాశాలలో దరిపల్లి అనంత రాములు కమిటీ హాల్ నందు నూతన కమిటీ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. తెలంగాణ రాష్ట్ర కుమ్మర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నడికుడి జయంతి రావు, వర్కింగ్ ప్రెసిడెంట్ ఏడుకొండల వెంకటేశం ప్రధాన కార్యదర్శి మల్కాజిగిరి దయానంద్ కోశాధికారి ఆమంచి రాజలింగం ల నాయకత్వంలో యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు ఓరుగంటి గోపాల్ ప్రధాన




కార్యదర్శి దరిపల్లి ప్రవీణ్ కుమార్, కోశాధికారి తాడూరి ఆంజనేయులు, అసోసియేట్ అధ్యక్షులు తాడూరు వెంకటేష్ ల ఆదేశాలతో గౌరాయపల్లి గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న యాదాద్రి భువనగిరి జిల్లా ప్రధాన కార్యదర్శి దరిపల్లి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ... కుమ్మరులలో ఐక్యత ముఖ్యమని, అది ఉంటేనే మనకు రాజకీయ చైతన్యం వస్తుందని, తద్వారా మన హక్కులను సాధించుకునే దిశగా ప్రయత్నం చేయవచ్చునని అన్నారు. కుమ్మర్లు రాజకీయంగా ఎదగాలంటే మనందరం సంఘటితం కావాలని అన్నారు. ఈ సందర్భంగా గౌరాయిపల్లి గ్రామ కమిటీని గ్రామ కుమ్మరుల సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నుకున్న వారిలో మొదటగా గౌరాయిపల్లి గ్రామ అధ్యక్షుడిగా కుందనపల్లి బిక్షపతి తండ్రి శివయ్య, ప్రధాన కార్యదర్శి కుందనపల్లి బిక్షపతి తండ్రి యాదగిరి, కోశాధికారి కుందనపల్లి మల్లేష్ తండ్రి బాల నరసయ్య, గౌరవాధ్యక్షులు తరిగొప్పుల మల్లేశం తండ్రి నర్సయ్య, ఉపాధ్యక్షులు కుందనపల్లి శ్రీనివాస్ తండ్రి బాల నరసయ్య, కార్యదర్శి కుందనపల్లి మల్లేష్ తండ్రి యాదగిరి లను ఏకగ్రీవంగా ఎన్నుకొని గౌరాయిపల్లి గ్రామ ఐక్యతను చాటారు. వీరితోపాటు గౌరాయిపల్లి సీనియర్ నాయకులు కుందనపల్లి నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారులపై దాడులకు అడ్డుకట్ట వేయాలి

### బాధిత బాలికకు న్యాయం చేయాలని

### మహమ్మద్ ఫరీద్ డిమాండ్

**హైదరాబాద్ పల్స్, జూన్ 13, మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి:**
ఖమ్మం నగరంలో మైనర్ బాలికపై జరిగిన దారుణ ఘటనపై డోర్నకల్ పట్టణ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నాయకుడు మహమ్మద్ ఫరీద్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, అమాయక బాలికపై జరిగిన ఈ ఘటన అత్యంత అమానుషమైందని, సమాజం మొత్తం సిగ్గుపడే పరిస్థితి ఏర్పడిందన్నారు. మహిళలు, చిన్నారుల భద్రత విషయంలో ప్రభుత్వం మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని ఆయన కోరారు. నేరాలకు పాల్పడే వ్యక్తులపై చట్టం తన పని తాను చేసేలా కఠిన చర్యలు తీసుకోవాలని, బాధిత కుటుంబానికి సంపూర్ణ న్యాయం జరిగేలా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. ప్రస్తుతం బాలిక చికిత్స పొందుతున్న నేపథ్యంలో ప్రభుత్వం మెరుగైన వైద్య సహాయం అందించడంతో పాటు కుటుంబానికి అవసరమైన ఆర్థిక, మానసిక సహకారం కల్పించిచడం హర్షణీయం అన్నారు ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా మహిళల రక్షణకు ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. చిన్నారులపై జరుగుతున్న నేరాలను అరికట్టడంలో ప్రజలు, ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ యంత్రాంగం సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. బాధితురాలికి న్యాయం జరిగే వరకు దోషులపై చట్టపరమైన చర్యలు కొనసాగించాలని మహమ్మద్ ఫరీద్ డిమాండ్ చేశారు.



# గురుకుల పాఠశాలలో మెయింటెనెన్స్ పనుల్లో నాణ్యత లోపం....

### పనులను అడ్డుకున్న స్థానిక కార్మికులు....

### ప్రజాధనం వృధా కాకుండా కలెక్టర్ స్పందించాలని బిజెపి నాయకుల డిమాండ్....






**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 13, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** రాజపేట మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో కొనసాగుతున్న మెయింటెనెన్స్ పనులు నాణ్యత లోపంతో జరుగుతున్నాయని ప్రజాధనం వృధా కాకుండా కలెక్టర్ స్పందించాలని బిజెపి నాయకులు డిమాండ్ చేశారు. శనివారం వారు పనుల పరిశీలించిన సందర్భంగా కలెక్టర్ కు ఫిర్యాదు చేయనునట్లు చెప్పారు. 2.67 కోట్ల రూపాయలతో మెయింటెనెన్స్ పనులు కొనసాగుతుండగా పలుమార్లు పరిశీలన చేసిన బిజెపి పనుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. సంబంధిత కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ తమ సూచనలను పాటించడం లేదని బిజెపి నాయకులు అన్నారు. స్థానికంగా ఉన్న కార్మికులకు అవకాశం కల్పించకుండా వారి పొట్ట కొడుతున్నట్లు కూడా స్థానిక కార్మికులు ఆవేదన వ్యక్తం చేసి ఆందోళన చేశారు. పనులు నిలిపివేయాలని అడ్డుకున్నారు. డూప్లికేట్ ఫ్యాన్లు నాణ్యత లేకుండా ఫ్లోర్ వేయడం, క్యూరింగ్ లేకుండానే రంగులు పూయడం, లాంటి అడుగడుగునా నిబంధనలకు విరుద్ధంగా మెయింటెనెన్స్ పనులు సాగుతున్నట్లు స్థానిక నాయకులు ఆరోపిస్తూ కలెక్టర్ స్పందించకపోతే ఆందోళన తీవ్రతరం చేయనున్నట్లు హెచ్చరించారు.

# తిరుపతిలో తెలంగాణ భవన నిర్మాణ కమిటీ చైర్మన్ గా దోసపాటి

### ప్రమాణ స్వీకారం చేసిన ఎస్ కె టి గ్రూప్స్ అధినేత దోసపాటి వెంకటేశ్వరావు



**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 13, భద్రాద్రి జిల్లా ప్రతినిధి :**
తెలంగాణ రాష్ట్ర ఆర్య వైశ్య మహాసభ భక్తుల సౌకర్యార్థం తిరుపతిలో తెలంగాణ భవన నిర్మాణ కమిటీ చైర్మన్ గా ప్రమాణ స్వీకారం చేసిన ఎస్ కె టీ గ్రూప్ సంస్థల చైర్మన్ దోసపాటి వెంకటేశ్వరావు..భక్తుల కోసం తిరుమలలో తెలంగాణ భవనం నిర్మాణం చేయదలిచి దాని కోసం చైర్మన్ గా తెలంగాణ రాష్ట్ర ఆర్య వైశ్య మహాసభ అధ్యక్షులు అమరవది లక్ష్మి నారాయణ ఆంధ్ర ప్రదేశ్ రాజకీయవేత్త ప్రముఖ పారిశ్రామికవేత్త టీజీ వెంకటేష్ చేతుల మీదుగా తిరుపతిలో తెలంగాణ భవన నిర్మాణ కమిటీ చైర్మన్ గా నియామక పత్రం అందుకున్న ఎస్ కె టీ గ్రూప్ సంస్థల చైర్మన్ దోసపాటి వెంకటేశ్వరావు. ఈ సందర్భంగా దోసపాటి మాట్లాడుతూ నాపై నమ్మకం ఉంచి తిరుపతిలో తెలంగాణ భవన నిర్మాణ కమిటీ చైర్మన్ గా బాధ్యతలను వమ్ము చేయకుండా తెలంగాణ రాష్ట్ర ఆర్య వైశ్య మహాసభ భక్తుల కొరకు తిరుపతిలో భవన నిర్మాణం చైర్మన్గా బాధ్యతలు నిర్వహిస్తానని ఈ సందర్భంగా వారు అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జిల్లాల నుండి ఆర్య వైశ్యులు పాల్గొన్నారు.

# ఎంఏ ఎజాస్ ని పరామర్శించిన ఆలేరు మున్సిపల్ వైస్ చైర్మన్



**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 13, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** ఇటీవల అనారోగ్యానికి గురైన ఆలేరు సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ పట్టణ అధ్యక్షులు ఎంఏ ఎజాస్ ని పరామర్శించిన ఆలేరు మున్సిపల్ వైస్ చైర్మన్ అంగిడి ఆంజనేయులు మరియు సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మల్లెల శ్రీకాంత్, వట్టిపల్లి శ్రీనివాస్, పర్శ నరేష్, తదితరులు ఉన్నారు.

హైదరాబాద్ పల్స్



## భారత్ కు ఇరాన్ భారీ గుడ్ న్యూస్..?
# తక్కువ ధరకే పెట్రోల్, డీజిల్..!

**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 13, సెంట్రల్ బ్యూరో:**
అమెరికా, ఇరాన్ దేశాల మధ్య శాంతి ఒప్పందం కుదిరేందుకు రంగం సిద్ధం అవుతోంది. ఈ పరిణామాలు భారత్ కు అత్యంత కీలకమైనవిగా మారాయి. ఈ ఒప్పందం ద్వారా ఇరు దేశాల మధ్య సత్సంబంధాలు బలపడితే, భారత్– ఇరాన్‌ల మధ్య నిలిచిపోయిన వాణిజ్య లావాదేవీలకు మళ్లీ మార్గం సుగమం అవుతుందా అన్న ఆశలు చిగురిస్తున్నాయి. ప్రధానంగా చౌక ధరకు ముడి చమురు, గ్యాస్ దిగుమతులు పునః ప్రారంభం అవుతాయా అనే ఉత్కంఠ నెలకొంది.గతంలో అంతర్జాతీయ వేదికలపై జమ్మూ కాశ్మీర్ వంటి కీలక అంశాల్లో ఇరాన్.. భారత్ కు ఎంతో అండగా నిలిచింది. గల్ఫ్ కోఆపరేషన్ కౌన్సిల్, ఆర్గనైజేషన్ ఆఫ్ ఇస్లామిక్ కోఆపరేషన్ వంటి వేదికలలో కూడా ఇరాన్ మద్దతు లభించింది. అయితే.. అమెరికాతో సత్సంబంధాల నేపథ్యంలో, భారత్ ఇరాన్ కు బహిరంగ మద్దతు ఇవ్వడంలో కొంత వెనకడుగు వేసింది. ఈ తరుణంలో తాజా ఒప్పందం భారత్ కు ఒక మంచి అవకాశంగా భావిస్తున్నారు.

**భారత్– ఇరాన్ ద్వైపాక్షిక సంబంధాలు**
అమెరికా ఒత్తిడి కారణంగా అంతర్జాతీయ వేదికలపై తటస్థ వైఖరిని ప్రదర్శించేందుకు దౌత్యపరంగా భారత్ ప్రయత్నించింది. అయితే కొన్ని సందర్భాల్లో భారత్.. అమెరికా వైపు మొగ్గు చూపినట్లు స్పష్టమైంది. ఈ క్రమంలోనే పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు ఉన్నప్పటికీ భారత ప్రధాని నరేంద్ర మోదీ.. ఇజ్రాయెల్ పర్యటన చేపట్టడం అంతర్జాతీయంగా చర్చనీయాంశమైంది. మోదీ అక్కడి పార్లమెంటు అయిన నెసెట్ ను ఉద్దేశించి ప్రసంగిస్తూ.. ఆ యూదు దేశాన్ని తమ “పితృభూమి”గా అభివర్ణించారు.గతంలో అమెరికా ఆంక్షలు విధించకముందు భారత్, ఇరాన్ మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం అత్యున్నత స్థాయికి చేరింది. ఇరు దేశాల మధ్య వాణిజ్య విలువ గరిష్టంగా 20 బిలియన్ డాలర్ల వరకు నమోదైంది. ఇంధన రంగంతో పాటు వ్యూహాత్మక మౌలిక వసతుల కల్పనలో ఇరు దేశాలు బలమైన భాగస్వామ్యాన్ని కలిగి ఉండేవి. ముఖ్యంగా 2017–18 ఆర్థిక సంవత్సరంలో భారత్.. ఇరాన్ నుండి సుమారు 12.11 బిలియన్ డాలర్ల ముడి చమురును దిగుమతి చేసుకుంది.అయితే.. 2019లో అమెరికా ప్రభుత్వం ఇరాన్ పై కఠినమైన ద్వితీయ శ్రేణి ఆంక్షలను విధించడంతో ఈ సంబంధాలు ఒక్కసారిగా దెబ్బతిన్నాయి. ఈ ఆంక్షల వల్ల ఇరాన్ తో ఎలాంటి వాణిజ్య సంబంధాలను కొనసాగించడం భారత్ కు దాదాపు అసాధ్యంగా మారింది. గ్లోబల్ బ్యాంకింగ్ వ్యవస్థల నుంచి ఎదురైన పరిమితులను అధిగమించేందుకు, విదేశీ మారక ద్రవ్య నిల్వలను నిర్వహించేందుకు ఇరు దేశాలు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించవలసి వచ్చింది. ఇందులో భాగంగా ప్రత్యేక రూపాయి ఆధారిత చెల్లింపుల విధానాన్ని రూపొందించారు.భారతీయ రిజర్వ్ బ్యాంక్, ఇరాన్ సెంట్రల్ బ్యాంక్ క్రోడీకరించి ఒక వినూత్న ఆర్థిక చెల్లింపుల వ్యవస్థను అడ్డు లేకుండా అమలులోకి తెచ్చాయి. దీని ప్రకారం భారత్.. ఇరాన్ నుంచి కొనుగోలు చేసిన చమురుకు రియాల్స్ రూపంలో చెల్లింపులు జరిపే ఏర్పాటు చేసుకుంది. కానీ ఈ ఆంక్షల తీవ్రత పెరగడం వల్ల ఇరాన్ వద్ద రూపాయి నిల్వలు త్వరగానే హరించుకుపోయాయి. దీంతో ఇరు దేశాల మధ్య వాణిజ్య సంబంధాలు క్రమంగా నిలిచిపోయే పరిస్థితి ఏర్పడింది.అమెరికా ఆంక్షల అనంతర కాలంలో భారత్, ఇరాన్ ద్వైపాక్షిక వాణిజ్యం భారీగా పడిపోయి 1.6 బిలియన్ డాలర్లకు పరిమితమైంది. ఆ తర్వాత 2020 నాటికి భారత్.. ఇరాన్ నుంచి ముడి చమురు దిగుమతులను పూర్తిగా సున్నాకు తగ్గించుకోవాల్సి వచ్చింది. ప్రస్తుతం ఇరు దేశాల మధ్య కేవలం మానవతా సహాయం, ప్రాథమిక అవసరాల వస్తువులకే వాణిజ్యం పరిమితమైంది. ప్రస్తుతం భారత్ నుంచి బాస్మతీ బియ్యం, టీ పొడి, ఔషధాలను ఇరాన్ కొనుగోలు చేస్తుండగా.. ఇరాన్ నుంచి ఎండుద్రాక్ష, రసాయనాలు భారత్ కు వస్తున్నాయి.

**చాబహార్ పోర్ట్ అభివృద్ధి ప్రాజెక్టు**
భారత్ వ్యూహాత్మకంగా ఎంతో ప్రతిష్టాత్మకమైన ఇరాన్ లోని చాబహార్ నౌకాశ్రయ అభివృద్ధి కోసం పదేళ్ల ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ఇండియా పోర్ట్స్ గ్లోబల్ లిమిటెడ్ ద్వారా షాహిద్ బెహెష్తీ టెర్మినల్ నిర్వహణను చేపట్టడానికి సిద్ధమైంది. ఈ నౌకాశ్రయానికి అవసరమైన యంత్రాలు, పరికరాల కొనుగోలుకు 120 మిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టడానికి భారత్ అంగీకరించింది. అదనంగా ఓడరేవు అభివృద్ధి మౌలిక వసతుల కోసం 250 మిలియన్ డాలర్ల రుణ సదుపాయాన్ని కూడా భారత్ ఆఫర్ చేసింది.ఈ భారీ ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లకుండా నిలిపివేయాలని వాషింగ్టన్ తీవ్రమైన ఒత్తిడి తెచ్చింది. ఇరాన్‌పై విధించిన ఆంక్షలను గౌరవించాలని అమెరికా హెచ్చరించడంతో, భారత్ అనివార్యంగా ఆ ఒత్తిళ్లకు లోబడాల్సి వచ్చింది. ఫలితంగా, ఎంతో ప్రయోజనకరమైన చాబహార్ ఓడరేవు అభివృద్ధి పనులు ఆచరణలో దాదాపుగా నిలిచిపోయాయి. ఇప్పుడు శాంతి ఒప్పందం కుదిరితే, ఈ అడ్డంకులు తిరిగి తొలగిపోయే అవకాశం ఉంది. దీని ద్వారా భారత్ ప్రాజెక్టుపై మళ్లీ దృష్టి సారించవచ్చు

# ఈ నెల 15 నుండి పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు పండుగే!

**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 13, తెలంగాణ బ్యూరో:**
తెలంగాణ ప్రభుత్వం విద్యార్థులకు శుభవార్త చెప్పింది. తెలంగాణా సర్కార్ పోషకాహార లోపాన్ని తగ్గించడం, వారి ఆరోగ్యాన్ని మెరుగుపరచడం కోసం ఒక ముఖ్యమైన కార్యక్రమాన్ని ప్రారంభించనుంది. అల్పాహారం పథకం పేరుతో ఈ కొత్త పథకం జూన్ 15, సోమవారం నుంచి అమలులోకి వస్తోంది.

**పాఠశాలలు, కళాశాలల్లో అల్పాహార పథకం:**
రాష్ట్రవ్యాప్తంగా మొదటి దశలో 1,269 ప్రభుత్వ పాఠశాలలు మరియు 33 ఇంటర్మీడియట్ కళాశాలల్లో ఈ పథకం అమలు చేయనున్నారు. తర్వాత దశల వారీగా అన్ని ప్రభుత్వ విద్యా సంస్థలకు విస్తరించాలని ప్రభుత్వం యోచిస్తోంది.ఈ పథకం కింద విద్యార్థులకు పోషకమైన అల్పాహారం అందించడంతో పాటు పాలు మరియు రాగి జావ కూడా అందజేయనున్నారు. ప్రధానంగా ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న పిల్లల ఆరోగ్యం, పోషకాహార సమస్యలను పరిష్కరించడమే దీని ముఖ్య లక్ష్యం.



**ప్రభుత్వ లక్ష్యం ఇదే**
ప్రభుత్వం ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల హాజరు శాతం పెంచడం, వారి ఏకాగ్రత మరియు అభ్యసన సామర్థ్యాలను మెరుగుపరచడం లక్ష్యంగా పెట్టుకుంది. విద్యా శాఖ అధికారులు ఇప్పటికే సంబంధిత పాఠశాలల్లో అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. అల్పాహారం తయారీలో పోషక విలువలు, శుభ్రత, నాణ్యతపై ప్రత్యేక దృష్టి సారించారు. రాగి జావ వంటి స్థానిక, పోషకమైన ఆహారాలను ఎంపిక చేయడం ద్వారా విద్యార్థులకు సమతుల్య ఆహారం అందించాలని భావిస్తున్నారు.

**ఆర్థికంగా వెనుకబడిన పిల్లలకు ప్రయోజనం**
ఈ పథకం వల్ల ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాల పిల్లలు ప్రయోజనం పొందుతారని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమం తెలంగాణలో విద్యా రంగంలో ఒక మైలురాయి అవుతుందని విద్యా నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఇలాంటి పథకాలు విద్యార్థుల శారీరక, మానసిక అభివృద్ధికి దోహదపడతాయి. ప్రభుత్వం ఈ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయడానికి అన్ని స్థాయిల్లో పర్యవేక్షణ చేస్తుందని తెలిపింది.

**మొదటి దశ సక్సెస్ అయితే తర్వాత విస్తరణ**
మొదటి దశలో ఫలితాలను సమీక్షించి తదుపరి విస్తరణకు నిర్ణయం తీసుకోనున్నారు. ఈ అల్పాహారం పథకం ద్వారా విద్యార్థులు ఆరోగ్యంగా, ఉత్సాహంగా బడికి వచ్చి చదువుకోవడం సాధ్యపడుతుందని తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వ విద్యా సంస్థల అభివృద్ధికి ఇది ఒక మంచి అడుగు అని భావిస్తున్నారు.

# ఏకంగా 25 మంది భార్యలు..
# రూ.కోట్లు నొక్కేసిన కేటుగాడి గుట్టు రట్టు!

**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 13 :**
పెళ్లి పేరుతో అమాయక మహిళలను నమ్మించి, కోట్ల రూపాయల సొమ్మును దోచుకుంటున్న ఒక ఘరానా కేటుగాడిని మహారాష్ట్ర పోలీసులు ఎట్టకేలకు చెరసాల పాలు చేశారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన అనూజ్‌కుమార్ చంద్రప్రకాష్ త్రివేది అనే నిందితుడు ఏకంగా 25 మందికి పైగా మహిళల జీవితాలతో ఆడుకుని వారిని భారీగా దగా చేశాడు. ఒక బాధిత వృద్ధురాలు స్థానిక పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా సాగిన లోతైన దర్యాప్తులో ఈ షాకింగ్ విషయాలు వెలుగులోకి వచ్చాయి.ఈ కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను పరిశీలిస్తే.. మహారాష్ట్రలోని ఠాణే పోలీసులను మార్చి 2022లో ఒక వృద్ధురాలు ఆశ్రయించారు. ఒక ప్రముఖ వార్తాపత్రికలో వచ్చిన పెళ్లి ప్రకటన ద్వారా పరిచయమైన వ్యక్తి, 2019లో తన మనవరాలిని వివాహం చేసుకున్నాడని ఆమె తెలిపారు. అయితే ఆ వరుడు తన అసలు పేరును పూర్తిగా దాచిపెట్టి, అజయ్ అగర్వాల్ అనే నకిలీ పేరుతో తమను నమ్మించి ఘోరంగా వంచించాడని సదరు వృద్ధురాలు తన ఫిర్యాదులో పేర్కొన్నారు.



**లక్షల రూపాయిల నగదు, బంగారంతో మాయం..**
వివాహం జరిగిన కొద్ది రోజులకే కొత్త ఇల్లు కట్టాలని, అలాగే మరో ఫ్లాట్ కొనాలంటూ బాధితులపై నిందితుడు తీవ్ర ఒత్తిడి తీసుకువచ్చాడు. ఈ క్రమంలోనే పలు విడతలలో వారి నుంచి సుమారు రూ.82 లక్షల నగదును గుంజాడు. ఆ తర్వాత ఫిబ్రవరి 2022లో బంధువుల పెళ్లికి వెళ్తున్నానని నమ్మబలికి, ఇంట్లోని సుమారు 33 తులాల విలువైన బంగారు ఆభరణాలతో పరారయ్యాడు. దీనిపై బాధితులు ఫిర్యాదు చేయడంతో పోలీసులు లోతుగా దర్యాప్తు జరిపారు.దర్యాప్తులో త్రివేది సాగించిన మ్యాట్రిమోనియల్ మోసాల చిట్టా బయటపడింది. పెళ్లిళ్ల సాకుతో వివిధ మ్యాట్రిమోనియల్ ప్లాట్‌ఫామ్‌లలో వితంతువులు, దివ్యాంగులు, నిస్సహాయ స్థితిలో ఉన్న ఒంటరి మహిళలను అతడు లక్ష్యంగా చేసుకునేవాడు. వారిపై అమితమైన ప్రేమ, సానుభూతి నటిస్తూ పెళ్లిళ్లు చేసుకుని, ఆపై నగదు, బంగారంతో చల్లగా జారుకునేవాడు. ఇలా అమాయకుల వద్ద నుంచి దోచుకున్న సొమ్ముతోనే అతడు అత్యంత విలాసవంతమైన బీఎండబ్ల్యూ కారును కూడా కొనుగోలు చేయడం విశేషం.ప్రస్తుతం నిందితుని వద్ద ఉన్న బీఎండబ్ల్యూ కారును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ వ్యవస్థీకృత మోసాల వెనుక నిందితుడి కుమారుడి ప్రమేయం కూడా ఉన్నట్లు బలమైన ఆధారాలు లభించడంతో అతనిపై కూడా సదరు ఠాణే పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. నిస్సహాయులైన మహిళల బలహీనతలను నైపుణ్యంగా ఆసరాగా చేసుకుని కోట్ల రూపాయలను దోచుకున్న ఈ తండ్రీ కొడుకుల మోసాల వ్యవహారంలో పోలీసులు తదుపరి చట్టపరమైన విచారణను ముమ్మరం చేశారు.

# రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం.. మరోసారి వేసవి సెలవులు పొడిగింపు..!

**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 13, సెంట్రల్ డెస్క్:**
విద్యార్థులకు వేసవి సెలవులు దాదాపు పూర్తయ్యాయి. తెలంగాణలో జూన్ 15 నుంచి పాఠశాలలు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం తగిన ఏర్పాట్లు చేస్తోంది. ఇక ఏపీలో జూన్ 12 నుంచే రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 45 వేల ప్రభుత్వ పాఠశాలలు, 44 వేల ప్రైవేటు పాఠశాలలు తిరిగి ప్రారంభం కావడంతో సందడి నెలకొంది. అయితే కొన్ని రాష్ట్రాల్లో మాత్రం పరిస్థితి వేరే విధంగా ఉంది. పెరుగుతున్న ఉష్ణోగ్రతల కారణంగా దేశంలోని కొన్ని రాష్ట్రాల్లో ఇంకా పాఠశాలలు ప్రారంభం కాలేదు. అనేక రాష్ట్రాల ప్రభుత్వాలు విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని వేసవి సెలవులను పొడిగిస్తున్నాయి.

**ఆ వివరాలు ఓ సారి చూస్తే..**
ఉత్తర్ ప్రదేశ్ లో పాఠశాలలు జూన్ 16 నుంచి



ప్రారంభం కానున్నాయి. ఇక దేశ రాజధాని దిల్లీలో జూలై 1 నుంచి విద్యాసంస్థలు ఓపెన్ కానున్నాయి. అలాగే హరియాణా, పంజాబ్ లో జూలై 1 నుంచి పాఠశాలలు ప్రారంభం కానున్నాయి. ఇక మధ్య ప్రదేశ్ లో మే 1 నుంచి జూన్ 15 వరకు వేసవి సెలవులు ఇచ్చారు. పాఠశాలలు తిరిగి జూన్ 16 నుంచి ప్రారంభం కానున్నాయి. ఛత్తీస్ ఘడ్ లోనూ జూన్ 16 నుంచే పాఠశాలలు ప్రారంభం కానున్నట్లు అధికారులు తెలిపారు.మరోవైపు బిహార్ లో మాత్రం జూన్ 21 న పాఠశాలలు ప్రారంభం అవుతాయని విద్యాశాఖ స్పష్టం చేసింది. ఇక రాజస్థాన్ లో కూడా జూన్ 21 వ తేదీన పాఠశాలలు ప్రారంభం కానున్నట్లు అధికారులు పేర్కొన్నారు. అయితే జమ్మూ కాశ్మీర్ లో మాత్రం ఇంకా పాఠశాలలు ప్రారంభం కాలేదు. ఈ విషయంపై అక్కడి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉన్నట్లు సమాచారం. వివిధ రాష్ట్రాల్లో విద్యా సంస్థల పరిస్థితి ఈ విధంగా ఉంది. అటు తమిళనాడులో జూన్ 4 వ తేదీనే పాఠశాలలు ప్రారంభం కావడం విశేషం. ఇక కర్ణాటకలోనూ జూన్ 1 నే స్కూల్స్ ప్రారంభం అయ్యాయి. కేరళలోనూ పాఠశాలలు జూన్ 1 నుంచే ఓపెన్ అయినట్లు సమాచారం.

# నాలాల పరిస్థితిని పరిశీలించిన స్థానిక మాజీ కార్పొరేటర్

### కురిసిన వర్షాల వల్ల దెబ్బతిన్న నాలాల పరిశీలన

**రాంగోపాల్ పేట్, జూన్ 13,హైదరాబాద్ పల్స్ ప్రతినిధి :**
ఇటీవల కురిసిన భారీ వర్షాల నేపథ్యంలో రాంగోపాల్ పేట్ డివిజన్లోని పార్క్ లైన్, మెక్లియోడ్‌గూడ, చుట్టల్ బస్తీ ప్రాంతాల్లోని నాలాల పరిస్థితిని స్థానిక మాజీ కార్పొరేటర్ చీరా సుచిత్ర శ్రీకాంత్ పరిశీలించారు. స్థానికుల ఫిర్యాదు మేరకు పార్క్ లైన్ నాలా ప్రహరీ గోడ కింద భాగం పూర్తిగా బలహీన పడిపోయి ఎప్పుడైనా కూలిపోయే ప్రమాదకర స్థితిలో ఉందని గుర్తించారు. వెంటనే ఈ విషయాన్ని కావాడిగూడ డీఈ హేము నాయక్, బేగంపేట్ డీఈ మహేష్ దృష్టికి తీసుకెళ్లగా, పరిధి వివాదం పేరుతో ఇరు అధికారులు బాధ్యతను ఒకరిపై ఒకరు నెట్టివేస్తూ కాలయాపన చేస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. వ్యాపార సముదాయాలు మరియు స్థానిక నివాసితులు ప్రాణనష్టం జరిగిన తరువాతే అధికారులకు చలనం వస్తుందా? అంటూ తమ ఆందోళనను సుచిత్ర శ్రీకాంత్ తో పంచుకున్నారు.దీనిపై ఆమె వెంటనే జోనల్ కమిషనర్, డిప్యూటీ కమిషనర్ దృష్టికి విషయం తీసుకెళ్లారు. అదేవిధంగా, 8 నెలల క్రితం మెక్లియోడ్‌గూడ నాలా ప్రహరీ గోడ కూలిపోవడంతో ఇప్పటికీ పునర్నిర్మాణం జరగకపోవడం, అలాగే చుట్టల్ బస్తీ మరియు పార్క్ లైన్ ప్రాంతాల్లో నాలా పూడిక తొలగింపు సమయంలో కూల్చిన ప్రహరీ గోడలను ఇప్పటివరకు పునర్నిర్మించకపోవడాన్ని స్థానికులు ప్రస్తావించారు.దీనిపై కూడా సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయడంతో పాటు జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్ కి ఫోటోలు,



వీడియోలను పంపించారు. ఈ కార్యక్రమంలో మదన్, శ్రీధర్, అలోక్ యాదవ్, శ్రీను, సంతోష్ ,రవి కుమార్ , అభినవ్ ,నవీన్,రోహిత్ మరియు బస్తీ వాసులు పాల్గొన్నారు.

# “వెన్నతో” ఇలా చేస్తే సూపర్ రిజల్ట్!

పాలకు సంబంధించిన ఆహారపదార్థాలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. అలాంటి వాటిల్లో “వెన్న(బటర్)” కూడా ఒకటి. వివిధ రకాల ఆహార పదార్థాలకు రుచిని అందించడానికి దీన్ని ఎక్కువగా వాడుతుంటాం. కానీ, మీకు తెలుసా? కేవలం వంటల్లో ఉపయోగించడమే కాదు మన నిత్య జీవితంలో వెన్న వల్ల ఎన్నో రకాల ఉపయోగాలు ఉన్నాయని చెబుతున్నారు నిపుణులు. ప్లాస్టిక్? డబ్బాలపై మరకల నుంచి గిన్నెల నీచు వాసన పోగొట్టడం వరకు బటర్?తో బోలెడు ఉపయోగాలున్నాయంటున్నారు. మరి, అవేంటో ఈ స్టోరీలో తెలుసుకుందాం.ప్లాస్టిక్ వస్తువులు లేదా డబ్బాలపై ఏర్పడిన మరకలు క్లీన్ చేయాలంటే ఎవరికైనా కాస్త కష్టంగానే అనిపిస్తుంది. అలాంటి సందర్భాల్లో వెన్నను ఉపయోగిస్తే వాటిపై ఉన్న మరకలను చాలా ఈజీగా తొలగించవచ్చుంటున్నారు నిపుణులు. ఇందుకోసం మీరు చేయాల్సిన పని ఏంటంటే, మరకలు ఏర్పడిన చోట కొద్దిగా బటర్ రాసి కొద్దిసేపు అలాగే ఉంచేయాలి. ఆ తర్వాత ఏదైనా శుభ్రమైన వస్త్రంతో తుడిచేస్తే చాలు మరకలు సులభంగా వదిలిపోయి నీట్‌గా కనిపిస్తాయంటున్నారు.మన ఇళ్లలో చాలా సందర్భాల్లో డోర్ క్లోజ్ చేస్తున్నప్పుడు, ఓపెన్ చేస్తున్నప్పుడు కిర్?ర్ మనే సౌండ్ వస్తూ ఉంటుంది. ఆ శబ్దాన్ని పోగొట్టడానికి వెన్న చాలా బాగా ఉపయోగపడుతుందంటున్నారు. ఇందుకోసం కొద్దిగా వెన్న తీసుకుని మడత బందులకు రాస్తే శబ్దం రాకుండా ఉంటుందని, తలుపు కూడా చక్కగా సెట్ అవుతుందని చెబుతున్నారు నిపుణులు.చేతులకు అంటుకున్న జిగురు(గ్లూ)ని వదలగొట్టడం ఇబ్బందిగా ఉంటుంది. అలాంటి సందర్భాల్లో హ్యాండ్స్ క్లీన్ చేసుకునే ముందు బటర్ రాసుకోవడం ద్వారా గ్లూని సులభంగా వదిలించుకోవచ్చని చెబుతున్నారు.కొన్నిసార్లు వేలికి ఉన్న ఉంగరాలు బిగుతుగా మారుతుంటాయి. ఎంత తీసినా రావు. అప్పుడు వేళ్లకు కాస్త బటర్ రాసి తీస్తే ఉంగరాలు ఈజీగా వచ్చేస్తాయని చెబుతున్నారు.మనం కొన్నిసార్లు కర్రీ వండడానికి ఎక్కువ మొత్తంలో ఉల్లిపాయలు కట్ చేస్తుంటాం. అలాంటప్పుడు సగం కోసిన ఉల్లిపాయలు మిగిలిపోతుంటాయి. అలా కోసి ఆనియన్స్ పాడవకుండా ఉండాలంటే వాటిపై కొద్దిగా వెన్న రాయాలని.. ఇలా చేస్తే ఉల్లిపాయ వాడిపోదని, ఘాటు కోల్పోదంటున్నారు.చెక్క వస్తువులపై ఏర్పడిన నీటి మరకలు అందవిహీనంగా కనిపిస్తుంటాయి. అవి తొలగించడానికి రాత్రి టైమ్‌లో కాస్త బటర్ రాసి నెక్ట్స్ డే మార్నింగ్ క్లీన్ చేసుకుంటే సరిపోతుందని చెబుతున్నారు. వుడ్ ఫర్నిచర్‌ను మెరిసేలా చేయడానికి కూడా వెన్నను ఉపయోగించవచ్చని నిపుణులు చెబుతున్నారు.చర్మాన్ని మాయిశ్చరైజ్ చేయడానికి బటర్ సహాయపడుతుంది. ముఖ్యంగా శీతాకాలంలో స్కిన్ పొడిబారి ఎండిపోయినట్లు కనిపిస్తుంది. ఆ టైమ్‌లో కొద్దిగా వెన్నను చర్మం మీద రాసుకోవడం వల్ల మంచి ఫలితం ఉంటుందంటున్నారు. స్కిన్ మృదువుగా మారుతుందని చెబుతున్నారు.చేపలు క్లీన్ చేసిన తర్వాత వాటిని ఉంచిన గిన్నెల నుంచి వచ్చే నీచు వాసన ఓ పట్టాన పోదు. అలాంటప్పుడు వాసన వచ్చే పాత్రలనుకాస్త వెన్నతో తోమాలి. ఆపై సబ్బు ఉపయోగించి గోరువెచ్చని వాటర్‌తో శుభ్రం చేయాలి. ఇలా చేస్తే పాత్రల నుంచి నీచు వాసన రాకుండా ఉండడమే కాకుండా, కొత్త వాటిలా కనిపిస్తాయంటున్నారు నిపుణులు.



# ఎప్పుడైనా “అఫ్ఘానిస్థాన్ చికెన్ కర్రీ” రుచి చూశారా?

## ఒక్కసారి తింటే మళ్లీ మళ్లీ కావాలంటారు!



సండే వస్తే చాలు చాలా మంది విందులోకి బిర్యానీయో, చికెన్ కర్రీయో లేనిదే భోజనం కానివ్వరు. ఇక నాన్‌వెజ్ లవర్స్ అయితే ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. అయితే, ప్రతి సండే ఒకటే తరహాలో చికెన్ కర్రీ తిని బోర్ కొట్టిందా సరికొత్త టేస్ట్‌ను ఎంజాయ్ చేయాలనుకుంటున్నారా? అలాంటి వారికోసమే ఈ సూపర్ రెసిపీ. అదే, అఫ్ఘానిస్థాన్ స్టైల్‌లో అద్దిరిపోయే “చికెన్ కర్రీ”.ఇది రెగ్యులర్‌గా చేసుకునే దానికన్నా మంచి రుచికరంగా ఉండి తిన్నా కొద్దీ తినాలనిపిస్తుంది. అలాగే, దీన్ని రెడీ చేసుకోవడానికి ఎక్కువ టైమ్ కూడా పట్టదు. ఇంట్లో వారు ఒక్కసారి రుచి చూశారంటే మళ్లీ మళ్లీ చేసిపెట్టమని అడుగుతారు! ఈ కర్రీ అన్నంలోకి మాత్రమే కాకుండా ఫ్రైడ్ రైస్, చపాతీ, రోటీ ఇలా దేనిలోకైనా భలే కమ్మగా ఉంటుంది. మరి, లేట్ చేయకుండా ఈ నయా స్టైల్ చికెన్ కర్రీని ఎలా చేసుకోవాలో ఇప్పుడు చూద్దాం.

**కావాల్సిన పదార్థాలు :**

కేజీ – చికెన్
ఒక కప్పు – పెరుగు
అర కప్పు – ఫ్రెష్ క్రీమ్
రుచికి సరిపడా – ఉప్పు
రెండు టేబుల్‌స్పూన్లు – అల్లంవెల్లుల్లి పేస్ట్
పది – బాదం
పదిహేను – జీడిపప్పులు
నాలుగైదు – పచ్చిమిర్చి
రెండు టేబుల్ స్పూన్లు – నిమ్మరసం
ఒకటిన్నర స్పూన్లు – మిరియాలపొడి
ఒక స్పూన్ – జీలకర్ర పొడి
అర స్పూన్ – గరంమసాలా
రెండు టేబుల్‌స్పూన్లు – కసూరీ మేతి
మూడు టేబుల్‌స్పూన్లు – వెన్న
రెండున్నర టేబుల్‌స్పూన్లు – నూనె

**తయారీ విధానం :**

ఈ కొత్తరకం చికెన్ కర్రీ కోసం ముందుగా ఒక గిన్నెలో వేడినీళ్లు తీసుకుని అందులో బాదం, జీడిపప్పులను వేసి పావుగంట పాటు నానబెట్టాలి.ఆలోపు చికెన్‌ను శుభ్రంగా కడిగి జల్లిగిన్నెలో వేసి పక్కనుంచాలి. అలాగే, జీలకర్ర పొడి, మిరియాలపొడిని సిద్ధం చేసి పెట్టుకోవాలి.ఇప్పుడు మిక్సీ జార్ తీసుకుని అందులో పచ్చిమిర్చి, పెరుగు, ఫ్రెష్ క్రీమ్, అల్లంవెల్లుల్లి పేస్ట్, గరంమసాలా, రుచికి తగినంత ఉప్పు, నిమ్మరసం వేసుకోవాలి.అలాగే, నానబెట్టిన బాదం, జీడిపప్పులను కూడా వేసి మెత్తని పేస్ట్‌లా గ్రైండ్ చేసుకోవాలి.నెక్ట్స్ శుభ్రంగా కడిగి పెట్టుకున్న చికెన్‌లో గ్రైండ్ చేసిన జీడిపప్పులు–బాదం మిశ్రమం, ముందుగా రెడీ చేసుకున్న జీలకర్రపొడి, మిరియాల పొడి వేసుకుని అవన్నీ చికెన్ ముక్కలకు మంచిగా పట్టేలా బాగా కలుపుకోవాలి.తర్వాత ఆ మిశ్రమాన్ని ఫ్రిడ్జ్‌లో రెండు గంటలపాటు ఉంచాలి. మీకు ఒకవేళ టైమ్ ఉంటే రాత్రంతా ఉంచితే రుచి ఇంకా చాలా బాగుంటుంది.అనంతరం స్టవ్ మీద కర్రీకి సరిపోయే పాన్ లేదా కడాయిని ఉంచి తగినంత నూనె పోసి వేడి చేసుకోవాలి.ఆయిల్ హీట్ అయ్యాక మ్యారినేట్ చేసి ఫ్రిడ్జ్‌లో ఉంచిన చికెన్‌ను వేసి మీడియం ఫ్లేమ్‌లో మూతపెట్టి ఉడకనివ్వాలి.పది నిమిషాలకు చికెన్ నుంచి నీరు బయటకు వస్తుంది. అప్పుడు మంటను పెంచి ఒకసారి గరిటెతో కర్రీని కలియబెట్టాలి.తర్వాత మళ్లీ మంటను తగ్గించి చికెన్ బాగా మెత్తగా అయ్యే వరకూ ఉడికించుకోవాలి.అలా ఉడకడానికి 20 నుంచి 25 నిమిషాల వరకు సమయం పట్టొచ్చు.ఆవిధంగా చికెన్ ఉడికిందనుకున్నాక చివర్లో వెన్న యాడ్ చేసుకుని కలిపి మరో నిమిషం మగ్గనివ్వాలి.ఆ తర్వాత స్టవ్ ఆఫ్ చేసి దించేసి ఉల్లి స్లైసులు, నిమ్మ ముక్కలతో గార్నిష్ చేసుకుని సర్వ్ చేసుకుంటే చాలు.అంతే, సరికొత్త రుచితో నోరూరించే “అఫ్ఘానిస్థాన్ స్టైల్ చికెన్ కర్రీ” రెడీ అవుతుంది!మరి, నచ్చితే మీరూ ఎప్పుడూ చేసుకునే పద్ధతిలో కాకుండా ఓసారి ఇలా చికెన్ కూర చేసి చూడండి. ఇంటిల్లిపాదీ వావ్ సూపర్ టేస్ట్ అంటూ ఫిదా అవుతారు!

# “అటుకుల చక్కెర పొంగలి”

## ఈ కొలతల్లో ట్రై చేశారంటే కమ్మగా ఉంటుంది!



వ్రతాలు, పండుగలు, పూజల సమయాల్లో ఎక్కువ మంది చక్కెర పొంగలి ప్రిపేర్ చేస్తుంటారు. దీనిని వివిధ రకాలుగా తయారు చేస్తారు. మరి మీరెప్పుడైనా అటుకల చక్కెర పొంగలి తిన్నారా లేదంటే మాత్రం ఓసారి ఈ విధంగా చేస్తే చాలా అద్దిరిపోతుంది. మొదటిసారు చేసేవారైనా ఈ స్టెప్స్ పాటిస్తే పర్ఫెక్ట్‌గా వస్తుంది. మరి ఆలస్యం చేయకుండా ఈ స్వీట్ రెసిపీని ఎలా చేయాలి? ఇందుకు కావాల్సిన పదార్థాలేంటో ఇప్పుడు చూద్దాం.



**కావాల్సిన పదార్థాలు :**

మందపాటి అటుకులు – 2 కప్పులు (500 గ్రాములు)
పెసరపప్పు – అర కప్పు
పచ్చికొబ్బరి ముక్కలు – అర కప్పు
బెల్లం తురుము – 2 కప్పులు
యాలకుల పొడి – 2 టీ స్పూన్లు
జీడిపప్పు పలుకులు – 20
కిస్మిస్ – 20
బెల్లం తురుము – 2 కప్పులు
పచ్చకర్పూరం – రెండు చిటికెడ్లు
నెయ్యి – సరిపడా



**తయారీ విధానం :**

ఈ రెసిపీ కోసం ముందుగా స్టవ్ ఆన్ చేసి గిన్నెలో అర కప్పు పెసరపప్పు వేయాలి. ఇప్పుడు మంటను లో ఫ్లేమ్‌లో ఉంచి పెసరపప్పును దోరగా వేయించి ఓ ప్లేట్‌లోకి తీసుకొని పూర్తిగా చల్లారనివ్వాలి.అదేవిధంగా ఓ గిన్నెలో రెండు కప్పుల మందపాటి అటుకులు వేసి రెండు సార్లు శుభ్రంగా కడగాలి. అనంతరం అటుకులను గట్టిగా పిండి ప్లేట్‌లో వేయాలి.అనంతరం స్టవ్ ఆన్ చేసి కుక్కర్‌లో వేయించిన పెసరపప్పు, సరిపడా నీళ్లు పోసి మూతపెట్టాలి. ఇప్పుడు మంటను మీడియం ఫ్లేమ్‌లో ఉంచి రెండు విజిల్స్ వచ్చేవరకు ఉడికించి స్టవ్ ఆఫ్ చేసుకోవాలి.మరోవైపు స్టవ్ ఆన్ చేసి పాన్?లో తగినంత నెయ్యి పోయాలి. నెయ్యి కరిగిన తర్వాత అర కప్పు పచ్చికొబ్బరి ముక్కలు వేసి వేయించాలి. పచ్చికొబ్బరి ముక్కలు వేగిన తర్వాత 20 జీడిపప్పు పలుకులు యాడ్ చేసి వేగనివ్వాలి. అనంతరం 20 కిస్మిస్ వేసి ఫ్రై చేసి ఓ ప్లేట్‌లోకి తీసుకోవాలి.ఇదే పాన్‌లో రెండు కప్పుల బెల్లం తురుము, మూడు కప్పుల నీళ్లు పోయాలి. బెల్లం కరిగి మరుగుతున్నప్పుడు అటుకులు వేసి కలిపి ఐదు నిమిషాల పాటు ఉడికించాలి.ఐదు నిమిషాల అనంతరం ఉడికించిన పెసరపప్పు యాడ్ చేసి మిక్స్ చేయాలి. ఆ తర్వాత రెండు టీ స్పూన్ల యాలకుల పొడి, రెండు చిటికెడ్ల పచ్చకర్పూరం వేసి మరో నాలుగు నిమిషాల పాటు ఉడకనివ్వాలి.నాలుగు నిమిషాల తర్వాత వేయించిన పచ్చికొబ్బరిజీడిపప్పు మిశ్రమం, కొద్దిగా నెయ్యి వేసి మిక్స్ చేయాలి. అనంతరం మంటను లో ఫ్లేమ్‌లో ఉంచి మరో ఐదు నిమిషాల పాటు ఉడికించి స్టవ్ ఆఫ్ చేయాలి.అంతే ఎంతో రుచికరంగా ఉండే అటుకుల చక్కెర పొంగలి మీ ముందుంటుంది!మీరు ఈ పొంగలిని ఎక్కువ మోతాదులో చేసుకోవాలనుకుంటే అటుకులు,పెసరపప్పుతో పాటు ఇతర పదార్థాలను అందుకనుగుణంగా పెంచి తీసుకోవాలి.







Edited, Published and Owned by Konadoddi Naveen Kumar and Printed at Srinith Publications Falcon Printing Press #1-2-201, Shop No.02, Khan Street Zaheerabad 502220.T.G. And Published from #1-2-201, Shop No.02, Khan Street Zaheerabad 502220.T.G. Editor's Konadoddi Naveen Kumar, Dr.Tadhkal Rahul Kumar Reg. No.TEL-TEL/2023/12249. Email.HyderabadPulse23@gmail.com, Web:www.HyderabadPulse.com, Cell: +91-94406 53413, +91-9989834020.